J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




లాయర్

సంపుటి : 44 సంచిక : 33 17.01.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## జనం మాటే.. పవన్ బాట

# స్వపక్షంలో విపక్షంగా జనసేనాని



సర్ధార్ వల్లభాయ్ పటేల్ జాతి సమైక్యతే ధ్యేయంగా జీవనం సాగించిన మహా నాయకుడు.. బాలగంగాధర్ తిలక్ మాటల్లో చేతల్లో విప్లవాగ్ని రగిల్చిన ధీశాలి.. వీరిద్దరి లక్షణాలను పునికి పుచ్చుకున్నట్లుగా.. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఓ సమ్మోహన శక్తి దూసుకెళ్తోంది. విషయం ఎలాంటిదైనా .. సమస్య ఎంత సంక్లిష్టమైనదై ప్రస్తుతం అంతటా వినిపిస్తున్న ఒకేఒక్క పేరు పవన్ కల్యాణ్..!

ఆంధ్రా రాజకీయాల్లో పవన్ మేనియా

ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకుడి తరహా పాత్ర

కూటమి తప్పులు తన వరకు రాకుండా జాగ్రత్తలు

తిరుపతి తొక్కిసలాట ఘటనలో అధికారులపై ఫైర్

టీటీడీ ఛైర్మెన్, ఈవో క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్


ప్రజాపక్షమే తన విధానమని స్పష్టీకరణ

తనదైన శైలి రాజకీయ వ్యూహాలతో.. విలక్షణ వ్యక్తిత్వంతో జనసేనాని పవన్ కల్యాణ్ రాటుదేలిన శక్తిగా మారుతున్నారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అవుతున్నారు. డెప్యూటీ సీఎం హోదాలో రాష్ట్రాన్ని చుట్టేస్తూనే.. ప్రభుత్వానికి ఇబ్బంది కలిగే సందర్భాల్లో అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. కూటమి ప్రభుత్వ తప్పులు తనవరకూ రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇటీవల తిరుపతిలో చోటు చేసుకున్న భక్తుల తొక్కిసలాట ఘటనే ఇందుకు ఉదా హరణ. ఈ క్రమంలో విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తూ... టీటీడీ ఛైర్మెన్, ఈఓ, అడిషనల్ ఈఓపై ఆయన నేరుగా విమర్శలు చేశారు.

10లో




12లో






జననం
03.11.1938

నిర్యాణం
08.01.2025

శ్రద్ధాంజలి

మంచిని పంచిన మానవతామూర్తి
ఆత్మీయత కురిపించిన అనురాగదీప్తి
మా కుటుంబ కీర్తి
మా ఉన్నతికి స్ఫూర్తి

శ్రీమతి డేగా దొరసానమ్మ గారు

(కీ॥శే॥ డేగా రామగోపాలరెడ్డి, Ex-MLC గారి సతీమణి)

తేది. 8.01.2025 బుధవారం స్వర్గస్తురాలైనారు.
వారి దివ్యస్మృతికి సద్గతి చేకూరాలని ప్రార్థిస్తూ...

కుమార్తె - అల్లుడు
పెన్నా శేషుకుమారి - డాక్టర్ పెన్నా మోహన్‌రెడ్డి
యూఎస్ఏ

కుమారులు - కోడళ్ళు
డేగా దేవకుమార్‌రెడ్డి - సాధన
బెంగళూరు

డేగా శ్రీనివాసులరెడ్డి - డాక్టర్ సునీత
చెన్నై

మరియు
మనుమలు - మనుమరాళ్ళు - మునిమనుమరాలు

## బాలల కేంద్రాల నిర్వహణకు..
# రిజిస్ట్రేషన్ తప్పనిసరి



జిల్లాలో అనాథ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ స్పష్టం చేశారు. బాలల సంరక్షణ అధికారుల బృందంతో కలసి ఇటీవల ఆయన నగరంలోని పలు బాలల సంరక్షణ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, బాలల సంరక్షణకు నిర్వాహకులు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలల న్యాయ చట్టం సెక్షన్ 41 ప్రకారం బాలల రక్షణ కేంద్రాల నిర్వహణకు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లా బాలల రక్షిత గృహాల తనిఖీ బృందం జిల్లా ప్రొబేషన్ అధికారి ఖాసిం దొర, ఐసీడీఎస్ అధికారిణి కె.లక్ష్మీదేవి తదితరులు పాల్గొని నెల్లూరులోని 7 చిల్డ్రన్ హోమ్‌లను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు.

# నేత్రపర్వంగా.. మనుబోలమ్మ గ్రామోత్సవం



మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మ అమ్మవారి గ్రామోత్సవం ఈనెల 12వ తేదీన నేత్రపర్వంగా జరిగింది. ప్రతిఏటా భోగిపండుగ ముందురోజున అమ్మవారికి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుండడం ఆనవాయితీ. ఈ వేడుకలో భాగంగా గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మ, గంగమ్మల మూలవర్లకు ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మనుబోలమ్మ అమ్మవారిని సింహవాహనంపై అధిష్టింపజేసి మేళతాళాలు, మంగళవాద్యాలతో, బాణసంచా వేడుకలతో ఊరేగింపు నిర్వహించారు. వేలసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# గత ప్రభుత్వ నిర్వాకం వల్లే రాష్ట్రం అప్పులపాలు!

- కూటమి ప్రభుత్వం వచ్చాక చక్కబడుతోందన్న మంత్రి నారాయణ

గత ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల పాలైందని, ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయిందని, అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని అన్నివిధాలుగా చక్కదిద్దడం జరుగుతోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరంలో ఆకస్మిక పర్యటనలు చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో పారిశుద్ధ్య పరిస్థితి ఎలా ఉందో పరిశీలించారు. నెల్లూరు నగరంలోని 48, 50, 51, 52 డివిజన్లలో పర్యటించి పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. తన పర్యటనలో భాగంగా స్థానిక సంతపేటలోని చేపల మార్కెట్‌ను సందర్శించారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అక్కడ ఉపాహారం తిన్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, గత ప్రభుత్వం అన్న వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, దాదాపు రెండు లక్షల పాతికవేల మంది కడుపు నింపే అన్న క్యాంటీన్లను మూసేసి పేదల కడుపు కడుపుకొట్టిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వచ్చాక, కేవలం 5రూపాయలకే మూడు పూటలా భోజనం పెడుతున్నామని, 56 రూపాయలు సబ్సిడీని ప్రభుత్వం భరిస్తూ అన్న క్యాంటీన్లను నడుపుతున్నామని చెప్పారు.



ఇష్టానుసారంగా నిధులు దారి మళ్లించడం వల్ల కేంద్రం నుండి రాష్ట్రానికి, మున్సిపాలిటీలకు రావలసిన వేలకోట్ల రూపాయల నిధులు ఆగిపోయాయన్నారు. తిరుపతిలో ఇటీవల జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించడం బాధాకరమని, అసలేం జరిగిందో తెలుసుకునేందుకు ఆ ఘటనపై న్యాయవిచారణకు ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. వర్షాకాలానికి ముందే మున్సిపాలిటీల్లో డీసిల్టింగ్ పనులు చేపట్టామని, అందుకోసం మున్సిపాలిటీలకు 50 కోట్లు కేటాయించామని చెప్పారు. తానెప్పుడూ ప్రజల అభివృద్ధి గురించే ఆలోచిస్తాను తప్ప, చెత్త రాజకీయాలు, నీచ రాజకీయాలు తనకు అలవాటు లేదని స్పష్టం చేశారు.

# దివ్యాంగుడికి.. 'పొన్నాల' చేయూత

నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయం కమిటీ మాజీ ఛైర్మన్, టీడీపీ నాయకుడు పొన్నాల రామచంద్రారెడ్డి ఓ దివ్యాంగునికి తనవంతు చేయూతనందించాడు. గ్రామంలోని నిరుపేద దివ్యాంగుడైన దామరమడుగు కోటేశ్వరరావుకు 45వేల రూపాయల విలువచేసే బ్యాటరీ ట్రైసైకిల్‌ను ఉచితంగా అందజేసి తన సేవాభావాన్ని చాటుకున్నాడు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు వెంకటశేషురెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, సురేష్, శ్రీను, మస్తానయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



# ప్రాణాలకు పొగబెడుతున్న.. 'నకిలీ సిగరెట్లు'!

ఉద్యమాలకు, ప్రజా చైతన్యానికి పుట్టినిల్లుగా ఉన్న నెల్లూరు ఇప్పుడు కల్తీలకు, నకిలీలకు, మోసాలకు, నీచపు వ్యాపారాలకు అడ్డాగా మారుతోంది. కల్తీ కంపుకొట్టే నిల్వమాంసం అమ్ముకుంటూ అక్రమధనార్జనకు పాల్పడేవారు కొందరైతే, ఏకంగా చేపల చెరువుల్లో గబ్బుకొట్టే కోళ్ళ వ్యర్థాలను మేతగా వేసి కాసుల పంట పండించుకునేవారు మరికొందరు. ప్రజలు తినే తిండిని కూడా కల్తీ చేసి, ప్రజారోగ్యాన్ని నాశనం చేస్తూ, ఇప్పటికే నెల్లూరు పేరు గబ్బుకొట్టిపోయింది. ఇప్పుడు తాజాగా పొగరాయుళ్ళ ప్రాణాలకు సెగబెడుతూ, నకిలీ సిగరెట్లకు నిలయంగా కూడా మారింది. ఎంతకాలంగా జరుగుతున్నదో తెలియదు కానీ, ఈ దుర్మార్గపు వ్యాపారం ఎట్టకేలకు విజిలెన్స్ అధికారుల దాడుల్లో బయటపడడంతో నెల్లూరు జనం విస్తుపోతున్నారు. ప్రజారోగ్యాన్ని నాశనం చేస్తున్న 'నకిలీ సిగరెట్ల మాఫియా'ల భరతం పట్టేందుకు ఉన్నతాధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- నెల్లూరు స్థావరంగా మరో మోసపు వ్యాపారం
- విజిలెన్స్ దాడుల్లో బయటపడ్డ బండారం
- 2.21 కోట్ల విలువైన సరుకు స్వాధీనం



అసలే ఆరోగ్యానికి ఇప్పుడు చేటు కాలం. ముఖ్యంగా ప్రాణాంతకమైన ఊపిరితిత్తుల వ్యాధులు విజృంభిస్తున్న తరుణం. సిగరెట్లు తాగడమే ఒక పెద్ద అనారోగ్యమైతే, నాసిరకం పొగాకుతో వారి ఆరోగ్యానికి మరింతగా పొగబెట్టడం ఎంత దారుణమో ఊహించుకోవచ్చు. సిగరెట్లు తాగడం వల్ల మరింతగా ఊపిరితిత్తులు పాడైపోయి, ఆరోగ్యం త్వరలోనే పాడెక్కబోతోందని తెలిసినా పొగరాయుళ్ళు మాత్రం వాటిని పీల్చడం మానలేకపోతున్నారు. ఆ బలహీనతను సొమ్ము చేసుకుంటూ, కాసులకు కక్కుర్తిపడే కొందరు వ్యాపారులు నకిలీ సిగరెట్లను కూడా జిల్లాకు దిగుమతి చేసి, పొగరాయుళ్ళ ఆరోగ్యాన్ని పూర్తిగా నాశనం చేయడానికి కంకణం కట్టుకుంటున్నారు. ఈనెల 10వ తేదీన నెల్లూరులో విజిలెన్స్ అధికారులు దాడులు చేసి గుట్టలుగుట్టలుగా ఉన్న నకిలీ సిగరెట్ల ప్యాకెట్లను పట్టుకున్నారు.

### ఉత్తరాది రాష్ట్రాల నుంచి జిల్లాకు దిగుమతి :

ఈ నకిలీ సిగరెట్ల వ్యాపారం వెనుక పెద్ద యంత్రాంగమే ఉంది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వాటిని ఇక్కడకు రహస్యంగా తెచ్చి, నెల్లూరులో వాటిని గోడౌన్లలో దాచిపెట్టి స్థానికంగా ఉండేవారి సహాయంతో వాటిని దుకాణాల వారికి విక్రయిస్తున్నట్లు అధికారులు తెలుసుకున్నారు. వీటిని అమ్మడం వల్ల వ్యాపారులకు బాగా లాభం ఉంటుంది కనుక, ఎక్కడ చూసినా ఈ నకిలీ సిగరెట్లే రాజ్యమేలుతున్నాయి. విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్ ఆదేశాలతో ఇన్స్‌పెక్టర్లు కె.నరసింహారావు, సుభాని, డీసీటీఓ విష్ణురావు రంగంలోకి దిగి ఈ నకిలీ సిగరెట్ల విక్రయాలపై నిఘా పెట్టి, నెల్లూరు నగరంలోనూ, కోవూరు సమీపంలోని ఇనమడుగులో ఉన్న మరో స్థావరంపైనా దాడులు చేసి, పలు ప్రముఖ కంపెనీల పేరుతో ఉన్న గుట్టలకొద్దీ నకిలీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ వ్యాపారానికి మేనేజర్‌గా ఉన్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని, పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.

### బయటపడ్డ బండారం.. కోట్లల్లో నకిలీ వ్యాపారం

ఈ నకిలీ సిగరెట్ల రాకెట్ వెనుక పెద్ద యంత్రాంగమే ఉన్నట్లు కూడా విజిలెన్స్ అధికారులు గుర్తించారు. చెన్నైకి చెందిన ఓ సిగరెట్ల వ్యాపారి ఉత్తరాది రాష్ట్రాల నుంచి భారీస్థాయిలో నకిలీ సిగరెట్లు మన రాష్ట్రానికి దిగుమతి చేయించి, జిల్లాల్లో వాటిని విక్రయించేందుకు పెద్ద వ్యవస్థనే ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులకు సమాచారం అందింది. నగరంలోని రామలింగాపురం సౌత్ రైల్వేస్టేషన్ వద్ద ఓ ఇంటిని అద్దెకు తీసుకుని, దానిని నకిలీ సిగరెట్లకు గోడౌన్‌గా ఏర్పాటు చేసుకున్నారు. ఈ గోడౌన్‌తో పాటు, ఇనమడుగు ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో కూడా అధికారులు దాడులు చేసి, మొత్తంగా 2 కోట్ల 21 లక్షల 11వేల 6 వందల రూపాయల విలువైన నకిలీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారంటే, ఈ నకిలీ దందా ఎంత పెద్దఎత్తున జరుగుతుందో అర్థమవుతోంది. ఒక్క రామలింగాపురం గోడౌన్‌లోనే సుమారు కోటీ 73 లక్షల రూపాయలకు పైగా విలువైన 3,31,100 నకిలీ సిగరెట్ ప్యాకెట్లను పట్టుకున్నారు. ఇనమడుగులో మరో 47.52 లక్షల విలువైన 1,18,800 సిగరెట్ ప్యాకెట్లు దొరికాయి. ఈ నకిలీ ముఠా ఇంకా ఏపీ రాష్ట్రాల్లో ఎంత భారీస్థాయిలో నకిలీ సిగరెట్లను విక్రయిస్తున్నారో, ఎంతమంది పొగరాయుళ్ళ ఊపిరి తీస్తున్నారోనంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం మరింతగా దృష్టిసారించి, ఈ నకిలీ వ్యాపారాన్ని పూర్తిస్థాయిలో నిరోధించాలని, ఈ మోసపు వ్యాపారంలో ఆరితేరిన సూత్రధారులు, పాత్రధారుల ఆట కట్టించాలని ప్రజలు



# నేత్రపర్వం.. తెప్పోత్సవం

సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని ఈనెల 15న కనుమ నాడు నెల్లూరు నవలాకులతోటలో పలు దేవతామూర్తులు కొలువుదీరారు. శ్రీ తల్పగిరి రంగనాథస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి, దుర్గాదేవి, భవానీమాత, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ షిరిడీ సాయిబాబా తదితర దేవుళ్లంతా ఊరేగింపుగా వచ్చి నవలాకులతోటలో వేలాదిమంది భక్తుల పూజలందుకున్నారు. దీంతో మైపాడుగేట్, నవాబుపేట ప్రాంతమంతా భక్తజన కోలాహలంతో నిండిపోయింది. నవాబుపేట వద్ద మైపాడుగేట్ సమీపంలోని జాఫర్ సాహెబ్‌కాలువ ఘాట్‌లో భ్రమరాంబికా సమేత మల్లేశ్వరస్వామికి పెద్దఎత్తున జరిగిన తెప్పోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ స్వామివారి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులంతా పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# ఆధ్యాత్మిక సేవలో..ఆల్తూరు కుటుంబం!

## జొన్నవాడ కామాక్షమ్మకి, నెల్లూరు రంగనాథునికి స్వర్ణాభరణాల సమర్పణ







**జిల్లాలో ఆధ్యాత్మిక సేవాతత్పరత కలిగిన కుటుంబాలలో ఆల్తూరు వారి కుటుంబం కూడా ఒకటి. అనేక ఆలయాల అభివృద్ధికి ఆద్యులు ఆల్తూరు కుటుంబసభ్యులు. తాజాగా జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి, నెల్లూరులో కొలువైవున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామికి ఆల్తూరు మహేష్‌రెడ్డి-రాధిక దంపతులు దివ్యమైన స్వర్ణాభరణాలను సమర్పించి తమ దైవభక్తిని చాటుకున్నారు.**

జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి ఈనెల 12న 207 గ్రాముల బంగారు సరుడుతో కూడిన మంగళసూత్రాలను మహేష్‌రెడ్డి-రాధిక దంపతులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి సాదరంగా ఆహ్వానించి దైవదర్శనం చేయించారు. ఆల్తూరు దంపతులు స్వామివారికి-అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసిన అనంతరం ఆలయ అర్చకులు దాతలకు దైవాశీర్వచనాలు అందజేశారు. శేషవస్త్రంతో, స్వామివార్ల ప్రసాదాలతో దాతలను సత్కరించారు. ఆల్తూరు మహేష్‌రెడ్డి-రాధికతో పాటు, దివంగత మహాదాత ఆల్తూరు ఆదినారాయణరెడ్డి సతీమణి.. ఆల్తూరు మహేష్‌రెడ్డి మాతృమూర్తి సులోచనమ్మ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అదేవిధంగా, నెల్లూరు రంగనాయకులపేటలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామివారి దేవాలయానికి ఈనెల 12న 287గ్రాముల బంగారుతో రూపొందించిన తిరునామం, స్వర్ణ నేత్రాలను ఆల్తూరు కుటుంబసభ్యులు బహుకరించారు. ఆ ఆభరణాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

### శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి..

# తోట ఉత్సవం



కనుమ పండుగ సందర్భంగా ఈ నెల 15న నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో తోట ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. అమ్మవారికి పారువేట అలంకారం చేసి ఊరేగించారు.. అనంతరం, నవలాకులతోట ఉద్యానవనంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

# భక్తిశ్రద్ధలతో 'పెద్దల పండుగ'



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 14న నెల్లూరులోని బోడిగాడితోట స్మశానవాటిక వద్దకు వేలాదిమంది చేరుకుని తమ పెద్దల సమాధుల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. చనిపోయిన తల్లితండ్రులు, బంధువులు, స్నేహితుల సమాధులను పూలతో అలంకరించి, వారి జ్ఞాపకాలతో గడిపారు. సంక్రాంతి నాడు దివంగతులైన తమ ఆత్మీయులను తలచుకుంటూ వారి సమాధుల వద్దకు వచ్చి పూజలు చేయడం నెల్లూరు నగరప్రజల ఆనవాయితీ.

# స్వర్ణాల చెరువులో..తెప్పల కనువిందు

కనుమ పండుగ సందర్భంగా నెల్లూరు చెరువు (స్వర్ణాల చెరువు)లో ఈనెల 15న జరిగిన తెప్పల పోటీలు సందర్శకులకు కనువిందు చేశాయి. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించగా, 35వ డివిజన్ టీడీపీ నాయకుడు బర్నాబాస్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ప్రజలు పెద్దసంఖ్యలో ఈ పోటీలను ఆసక్తిగా తిలకించారు.


# శ్రద్ధాంజలి



స్నేహశీలి, సహనశీలి
మా ఇంటి దేవత, మా అమ్మ

## శ్రీమతి బసిరెడ్డి శ్యామలమ్మ గారు

జనవరి 10, 2025, శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడు
అమెరికాలో దైవసాన్నిధ్యం పొందారు.

**అంత్యక్రియలు**

ఆమె అంతిమక్రతువులు జనవరి 18, 2025,
శనివారం మధ్యాహ్నం గం. 2.30 ని॥లకి
5265 నార్విచ్ స్ట్రీట్, హిల్లార్డ్‌లోని
"ది టిడ్ ఫ్యామిలీ ఫ్యునరల్ హోమ్" నందు జరుగును.

**ఉత్తరక్రియలు**

ఆమె ఉత్తరక్రియలు జనవరి 19, 2025,
ఆదివారం ఉ॥ 11.30 నుండి మ॥ 1.30 వరకు
"సుప్రీం అరేనా" 9525 SR 161 E, ప్లైన్ సిటీ,
ఒహాయో నందు జరుగును.

ఆమె దివ్య స్మృతికి సద్గతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు
బసిరెడ్డి ఉదయకిరణ్‌రెడ్డి - మేఘన
బసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి - తేజ

మనుమలు - మనుమరాళ్ళు
అక్షయ్, అశ్విన్, ధన్వి, శాన్వి
మరియు కుటుంబసభ్యులు

లాయర్
జనవరి 17, 2025

# 'తీపి' పదార్థాలతో.. జీవితాలకు చేదు!

తియ్యతియ్యని తీపి పదార్థాలు తినడానికి ఎంత బాగుంటాయో చెప్పలేం. ఒక్కసారి తింటే ఇంకా తినాలనిపించేదే తీపి. ఎంత తిన్నా తినాలని అనిపిస్తూనే ఉంటుంది. అందుకే పిల్లలే కాదు, పెద్దలు కూడా వాటికి బాగా అలవాటు పడిపోతుంటారు. ఆ అలవాటు ఇంకా ముదిరి, తీపి తినకుండా పూట గడవనివాళ్ళు కూడా ఎందరో ఉంటున్నారిప్పుడు. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా తీపంటే ఇష్టపడే వారికి కొదవేలేదు. అయితే, బాగా రుచిగా, కమ్మగా, తియ్యగా ఉండే ఆ తీపి పదార్థాలను అతిగా తీసుకుంటే ఆరోగ్యానికి అనర్థదాయకమని నిపుణుల తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. అందులోనూ ఇది 'డయాబెటిక్ కాలం'..అంటే, మధుమేహం..దానినే ముద్దుగా 'చక్కెర వ్యాధి' అంటున్నాం! మనిషి శరీరంలోని అవయవాల మీద తీవ్రమైన ప్రభావం చూపే ప్రాణాంతక వ్యాధి అది. అలాంటి విషపు వ్యాధులు విజృంభిస్తున్న రోజులివి. అందుకు తగ్గట్టు ఎక్కడ చూసినా కల్తీలు, నాసిరకం వస్తువులు మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. వాటితో కలిపి చేసే తీపి పదార్థాలు తినడం వల్ల నానా రకాల రోగాలు, అనారోగ్యాలు రాక తప్పడం లేదు. భలేగా ఉన్నాయంటూ స్వీట్లు ఎక్కువగా తింటే రక్తంలో షుగర్‌స్థాయి గందరగోళంగా మారి, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. చివరికి ఆ తీపి..జీవితాలకి చేదునే మిగిలిస్తుంటుంది. కనుక, తీపి పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, 'అతి' సర్వత్ర వర్జయేత్ అన్నట్లుగా అతిగా తీపిని తినడం వీలైనంతగా తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. తీపి పదార్థాలే కాదు, అంతకుమించి తీపిపానీయాలు కూడా ఆరోగ్యానికి ఇబ్బందికరమైనవే. రక్తంలో చక్కెర స్థాయిని ఎక్కువగా పెంచే ఇలాంటి పానీయాలను తీసుకున్నందువల్ల, బరువు పెరగడమే కాక, డయాబెటిస్ వంటి వ్యాధులతో పాటు, గుండె జబ్బులు కూడా పొంచి ఉన్నాయంటున్నారు నిపుణులు. ఇలాంటి తీపి పానీయాల వల్ల ప్రపంచవ్యాప్తగా మధుమేహం వ్యాధిగ్రస్తులు లక్షల సంఖ్యలో పెరిగిపోతున్నారని, దానికితోడు గుండె వ్యాధులు సైతం వచ్చి లక్షలాదిమంది నానా బాధలు పడుతున్నారని నిపుణుల నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంతెందుకు ప్రపంచంలో వస్తున్న మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో దాదాపు 9.8 శాతం మంది ఈ తీపి పానీయాల వల్లనే వ్యాధిగ్రస్తులుగా మారుతున్నారనే అధ్యయనాలును పరిశీలిస్తే, ఈ తీపి మానవాళికి ఎంత తియ్యటిముప్పుగా తయారవుతుందో అర్థం చేసుకోవచ్చు. రోగనిరోధక శక్తి తగ్గిపోవడం, ఆరోగ్యం మీద దుష్ప్రభావాలు చూపించడం వంటి ఇబ్బందులెన్నో ఈ తీపి పానీయాల వల్లనేనని పరిశోధకులు వెల్లడిస్తున్నారు. నేటి అధునాతన కాలంలో, ఏది మంచి తిండి..ఏది కాదు అని ఎంచుకునే తీరిక కూడా ఉండడం లేదు అనేకమందికి. ఏది దొరికితే అది తినేయడం, ఏది బాగుందనుకుంటే దాన్ని తాగేయడం. ఒకటే హడావిడి..యాంత్రిక జీవితాలతో ఆధునిక మానవుడు అనారోగ్యాలకు జీవితాలను బలిపెట్టుకుంటున్నాడంటే అతిశయోక్తి కాదు. ప్లాస్టిక్ ప్రపంచం వచ్చేశాక, ప్రతిదీ 'ప్యాక్' అయిపోతుంది. ఏం కావాలన్నా ప్యాకెట్లలో వచ్చేస్తుంటాయి. అవి తిన్న వారికి జబ్బులు, ఆ ప్లాస్టిక్ సంచుల్ని పారేస్తే, వాటిని తిన్న మూగజీవాలకు జబ్బులు, చివరికి వేలాది సంవత్సరాలు గడిచినా నేలపై పడిన ఆ సంచుల్ని అరిగించుకోలేక నేలతల్లికి అవస్థలు! సహజ సిద్ధమైన పోషకాహారం, అమ్మ చేతి వంట, సమతుల ఆహారం, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల వంటివి నేటికాలంలో నవ్వులాటగా మారాయి. మనం తినే ఆహారం మీదనే మనకు శ్రద్ధ ఉండడం లేదు. తినే ఆహారం బాగుంటనే ఆరోగ్యం బాగుంటుందని, ఆరోగ్యం బాగుంటేనే జీవితం బాగుంటుందని చెప్పినా వినేవాళ్ళు లేరు. అయినా, ఎవరి ప్యాకెట్టన్నం వారిదే!.. అన్నం అరిటాకుల్లో పెట్టుకుని తినే రోజులు ఎప్పుడో పోయాయి. అటు ప్లాస్టిక్ ప్రపంచం.. ఇటు ప్యాక్డ్ ఫుడ్స్ ప్రపంచం.. ఆరోగ్యాన్ని పడకెక్కిస్తున్నాయి. వంటికి బాగా ఉపయోగపడే చేదును కూడా తినమంటే ఎవరూ తినడంలేదు. కాకరకాయ చేదుగా ఉంటేనేం.. జీవితాన్ని డయాబెటిస్ వంటి వ్యాధుల నుంచి కాపాడుతుంది. మునగాకు మంచిదే అయినా, తినేవాళ్ళెందరు?.. మన పూర్వీకులు అనుభవమంతా రంగరించి మనకోసం ఏర్పాటు చేసిన మంచి ఆహారపుటలవాట్లు అటకెక్కిపోతుండడం వల్ల నేటితరమే కాదు, భావితరం కూడా జీవితాలను చేదుమయం చేసుకోవాల్సి వస్తోంది. పెద్దలు ఇకనైనా వీటిపై దృష్టి పెట్టి మన ఆరోగ్యకరమైన ఆహారమే పిల్లలకు కూడా అలవాటుపడేలా చూడాలి. లేదంటే వాళ్ళు ఏ తియ్యటి తీపి వైపో, పిజ్జాలు, బర్గర్ల వైపో వెళ్లిపోయి ఆరోగ్యాన్ని, మంచి జీవితాలను కూడా చేదుమయం చేసుకుంటారు!.. తస్మాత్ జాగ్రత్త!..




# భక్తుల ప్రాణాలు తీస్తున్న.. బాధ్యతారాహిత్యం!

*"వినదగు నెవ్వరు జెప్పిన*
*వినినంతనె వేగపడక వివరింపదగున్*
*గని కల్ల నిజము తెలిసిన*
*మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!"*

చిన్నప్పుడు చదువుకున్న సుమతీ శతకంలోని ఇలాంటి నీతిపద్యాలను పెద్దయ్యాక మరిచిపోతున్నామా?.. అంతేకాకుండా, నాటి పెద్దలు చెప్పిన మంచిని పక్కకునెట్టి, నిజజీవితంలో వాటికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నామా..?

ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానాలకు సంబంధించి వైకుంఠ ఏకాదశి దర్శన టోకెన్ల కోసం జరిగిన తొక్కిసలాట ఘటన చూస్తే.. అది నిజమేననిపిస్తోంది. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన శ్రీవారి ఆలయానికి నిత్యం లక్షల్లో భక్తులు వచ్చివెళ్తుంటారు. శ్రీవారి ఆలయానికి వెలకట్టలేనంత సంపద ఉంది. అటు ఆలయ వ్యవహారాలను చూసేందుకు, భక్తులకు దైవదర్శన భాగ్యం కల్పించేందుకు అనేకశాఖల్లో వందలాది మంది అధికారులు, సిబ్బంది ఉన్నారు. వాళ్లంతా పెద్దపెద్ద చదువులు చదువుకుని కీలకమైన శాఖల్లో అధికారులుగా ఉన్నారు. అధికారుల పనితీరు, వారి విధివిధానాలు పర్యవేక్షించి భక్తులకి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడడానికి పాలకమండలి కూడా ఉంది. ఇక్కడే అసలు సమస్య ఉత్పన్నమవుతోందా అన్న అనుమానం భక్తులలో కలుగుతోంది. అటు అధికారులు ఇటు పాలకమండలి మధ్య సమన్వయ లోపం.. భక్తజనానికి ఒక పెద్ద శాపంగా మారుతోందన్న విమర్శ వినపడుతోంది.

## ఒకరిమాట ఇంకొకరు వినని పరిస్థితి..

టీటీడీలోనే కాదు, నేటి సమాజంలో రానురాను ఒకరిమాట ఒకరు వినని తత్వం ప్రబలమైపోతోంది. అదే పోకడ టీటీడీ వ్యవస్థలో కూడా కొనసాగుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. పాలకుల సూచనలు అధికారులు, అధికారుల ప్రతిపాదనలు పాలకులు పట్టించుకునే వాతావరణం టీటీడీలో లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మరోవైపు ఐఏఎస్, ఐపీఎస్‌ల వంటివారు సైతం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల స్థాయి నాయకుల మాట కూడా వింటున్నారా? లేదా... అన్నది ప్రశ్నార్థకమే!.. వింటే, దుర్ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి?.. 'అధికారులు సహకరించడం లేదని' ఉప ముఖ్యమంత్రే ఆవేదన చెందారంటే అధికార వ్యవస్థలో పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో ఊహించుకోవచ్చు. అంతేకాదు, ఆ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల ఆదేశాలు జిల్లాస్థాయి అధికారులు పట్టించుకుంటున్నారా? అన్నది కూడా సందేహమే! ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు జిల్లా అధికారులు, జిల్లా అధికారుల మాటలను కిందిస్థాయి సిబ్బంది సక్రమంగా విని ఆచరించివుంటే భక్తులకు ఇలాంటి దుస్థితి వచ్చి ఉండేది కాదేమో!

ఎక్కడ లోపముందో, ఎక్కడ తొక్కిడికి అవకాశముందో వంటి అంశాలు ముందే గమనించుకుని చూసి, సరిచేసుకోవాలి కదా..! భగవంతుడిని దర్శించుకోవడానికి ఇచ్చే టోకెన్ల కోసం భక్తులు తమ ప్రాణాలు పణంగాపెట్టాలా? నిద్రాహారాలు వదులుకుని పూటల తరబడి క్యూలల్లో నిలబడాలా? అని ఆవేదన చెందుతున్న భక్తులకు సమాధానం ఏమని చెప్పగలం?.. ఆరు కుటుంబాలు అనాధలుగా మారాయే... ఆ పాపం ఎవరిది? శాపం ఎవరికి..? అందుకు బాధ్యులు ఎవరు..?

## సమన్వయ లోపం.. భక్తులకు శాపం..

టీటీడీలో జరిగిన దుర్ఘటననే ఒక ఉదాహరణగా తీసుకుంటే, దైవదర్శనం కోసం వచ్చే భక్తుల పట్ల అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది. ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తూ ఎవరికివారే యమునాతీరే అన్నట్లుగా క్రిందిస్థాయి నుండి పైస్థాయిదాకా అధికారులు సిబ్బంది ప్రవర్తించడమే ఆరు ప్రాణాలు పోవడానికి ప్రధాన కారణమైందన్న విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. పైవాళ్లు చెప్పింది వినకపోవడం, పెద్దల ఆదేశాలు పాటించకపోవడం, విధులు సక్రమంగా నిర్వహించకపోవడం, అన్నిటికీ మించి మొండితనం..'అంతా మా ఇష్టం' అనే నిరంకుశత్వమే ఈ దుర్ఘటనకి దారితీసిందని భక్తుల భావన. టీటీడీ చరిత్రలోనే ఇదో పెద్ద దుస్సంఘటన. సాక్షాత్తూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రే ఆ ఘటనకు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తూ 'అధికారుల బాధ్యతా రాహిత్యం, నిర్లక్ష్యమే ఈ ఘోరానికి కారణమని' తీవ్రస్థాయిలో మండిపడడం కూడా మనం చూశాం.

అయినా, పాలకమండళ్ళలోని వారు, అధికారులు ఇకనైనా సమన్వయంగా పనిచేస్తారా?..అన్నది ప్రశ్నార్థకమేనంటున్నారు భక్తులు!.. అటు పాలకమండలి వారైనా, అధికారులైనా సరే, తాముండేది దేవుడికి-భక్తులకు సేవచేయడానికే అని తెలుసుకున్నప్పుడే ఈ పరిస్థితుల్లో మార్పువస్తుందని, సామాన్య భక్తులకు కూడా న్యాయం జరుగుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

## ఆలయాలలో పటిష్ట వ్యవస్థలను ఏర్పాటుచేయాలి

ఆలయాల పాలకమండళ్ళలో, అధికారిక పదవుల్లో ప్రతిభతో పనిచేసేవారిని కాక, ఎవరి చిత్తానుసారం వారు నియమించుకోవడం, వారు ఆ స్థాయిలో పనిచేసేవాళ్ళా.. చేయలేనివాళ్ళా.. ఆ పనిచేసే సత్తా వాళ్లకి ఉందా లేదా? అని కూడా చూడకపోవడం వల్ల లేనిపోని సమస్యలు వస్తూనే ఉంటాయి. పదవులు కొందరికి అలంకారంగా, మరికొందరికి అహంకారంగా అవతరిస్తున్నాయి. పాలకమండళ్ళను రాజకీయోపజీవులకు ఆవాసంగా మార్చే విధానాలు పోవాలి. రాజకీయాలకు అతీతంగా ఆలయాల్లో మంచి వ్యవస్థలను ఏర్పాటుచేయాలి. విజ్ఞులు, అనుభవజ్ఞులైన వారిని, భక్తి-సేవ రెండూ నిండుగా ఉన్నవారిని మాత్రమే అధికారులుగా నియమించాలి. ముఖ్యంగా దేవాలయాల్లో బాధ్యతలు తీసుకున్నవాళ్ళు.. ఎంతటి స్థాయి వాళ్ళయినా సరే.. ఆ బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహించేలా ఉండాలి. ఇకనైనా, ఆలయాల్లో ఇలాంటి దుర్ఘటనలకు తావివ్వకుండా అందరూ సమన్వయంతో పని చేయాలి. ఒక్కమాట!.. 'మీరు చేసేది ప్రజాసేవే కాదు..ఆ భగవంతుని సేవ కూడా! ప్రజలకు మంచి చేస్తే అధికారులను, ప్రభుత్వాన్ని కూడా ప్రజలు ఆశీర్వదిస్తారు. భక్తులకు మంచి సేవలందిస్తే.. ఆ దేవుడు కూడా మీకు మేలు చేస్తాడు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలి. **"సర్వేజనా సుఖినోభవంతు"...!** - రాజశ్రీ

# ఎస్పీ గారూ.. నెల్లూరులో పోలీసు శాఖ ఉందా... ఉంటే పనిచేస్తోందా?

నెల్లూరులో పోలీసులు ఉన్నారా... ఉంటే సక్రమంగా తమ విధులు నిర్వహిస్తున్నారా? అని అనుమానం వేస్తోంది. ధనుర్మాసం సందర్భంగా నగరంలోని వైష్ణవ దేవాలయాలలో 29 రోజులపాటు తెల్లవారుఝామున 4 గంటల నుండి పూజలు జరిగాయి. ఆ దేవాలయాలన్నిటికీ భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అందులో మహిళల శాతం చాలా ఎక్కువ. ఇందులో భాగంగా మాగుంట లేఅవుట్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి కూడా ధనుర్మాసం నెలరోజులపాటు ఉదయం 4.30 నుండి భక్తులు పోటెత్తారు. వాళ్లలో మహిళలే అధికం. అలాగే వైకుంఠ ఏకాదశి రోజు కూడా శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు వేల సంఖ్యలో ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. మొత్తం ఈ 29 రోజులపాటు కనీసం ఒక్క ఆలయం వద్ద కూడా పోలీసు ఛాయలే కనపడకపోవడం విడ్డూరంగా వుంది. మాగుంట లే అవుట్ చుట్టుపక్కల నుండి మహిళలు తెల్లవారుఝామున నడిచి వచ్చేవారు. వారికి కనీస భద్రత కూడా పోలీసుశాఖ కల్పించలేదు. అంతే కాదు, వైకుంఠ ఏకాదశి పర్వదినంరోజు




మాగుంట లేఅవుట్ వద్ద గంటల తరబడి ట్రాఫిక్‌జామ్ అయినా అసలు పట్టించుకునే నాధుడే లేడు. నెల్లూరు పోలీసు వ్యవస్థలో అసలు ట్రాఫిక్ విభాగం ఉందా అన్నంత దరిద్రంగా నగర ట్రాఫిక్ మారిపోయింది. రెండువారాల క్రితం మన 'లాయర్' ప్రజావాణిలోనే రసూల్ అనే పాఠకుడు గాంధీబొమ్మ దుస్థితిని దుయ్యబట్టాడు. ఎస్.పి. దొరగారు ఇప్పటికైనా పట్టించుకుని పోలీసుశాఖను ప్రక్షాళన చేయకపోతే ప్రజల బతుకులు అధోగతే!

ఏం.సునందరెడ్డి
**మాగుంట లేఅవుట్, నెల్లూరు.**

# బూత్‌బంగ్లాగా మారిన.. 'బంగ్లాసెంటర్'

వింజమూరులో బంగ్లాసెంటర్ ఎంతో ప్రసిద్ధి. స్థానిక ప్రజలు, ప్రయాణీకులకే కాక ఎంతోమంది ప్రముఖులకు కూడా ఒకప్పుడది కేంద్రంగా ఉండేది. అందరూ ఇక్కడ కలుసుకునేవారు. ఎవరినన్నా కలవాలన్నా బంగ్లాసెంటర్‌లో ఉన్నాం ..రండి..అని చెప్పేవారు. కానీ, ఇప్పుడది బూత్‌బంగ్లాగా మారిపోతోంది. అక్కడ ఎలాంటి వసతులు లేకపోవడంతో ఆ సెంటర్ వెలవెలబోతోంది. గతంలో ఈ సెంటర్ జనం రద్దీతో కళకళలాడుతుండేది. నిత్యం ఎన్నో బస్సులు, ప్రభుత్వ ప్రైవేటు వాహనాలు ఇక్కడ నిలుస్తుండేవి. చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ తదితర దూరప్రాంతాల బస్సులకు కూడా ఇదొక స్టాపింగ్‌గా ఉండడం వల్ల స్థానికంగా ఉండే ప్రయాణీకులకు మంచి సౌలభ్యంగా ఉంటుండేది. అయితే, అదిప్పుడు కనుమరుగైపోయే దశకు చేరుకుంటోంది. ఈ సెంటర్‌ను పరిశుభ్రం చేయించి, ప్రయాణీకులకు విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేసి ఆ కూడలికి పూర్వవైభవం తేవాలి. స్థానిక నాయకులు, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని విన్నపం!

– నలుబోలు రామ్మోహన్‌రెడ్డి, **హైదరాబాద్.**

# లక్ష సభ్యత్వాల.. కోవూరు

## విపిఆర్ ఇంట టీడీపీ నాయకుల సంబరాలు



తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కోవూరు నియోజకవర్గం ఒక గొప్ప మైలురాయిని అధిగమించింది. కోవూరు నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వాలు లక్షకు చేరుకోవడం విశేషం. పార్టీ సభ్యత్వాలను ముమ్మరం చేయడంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు శాసనసభ్యురాలు ప్రశాంతిరెడ్డి చేస్తున్న కృషికి కార్యకర్తలు, అభిమానుల నుంచి పెద్ద ఊపు వచ్చినట్లయింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు విపిఆర్ నివాసంలో కేకు కట్‌చేసి అందరికీ పంచి ఆనందించారు. విపిఆర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువ నాయకుడు... మంత్రి లోకేష్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని చెప్పారు. ఎంపి మాట్లాడుతూ, ఐకమత్యమే మహాబలంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టికృషి చేయడం వల్లే లక్ష సభ్యత్వాల లక్ష్యాన్ని చేరుకోగలిగామన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కష్టపడు తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని వారు భరోసా యిచ్చారు.

### ఇది కార్యకర్తల కష్టార్జితమే

**- ఎమ్మెల్యే ప్రశాంతమ్మ**

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, కోవూరు నియోజక వర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు లక్షకు చేరుకోవడం హర్షదాయకమని, కోవూరు టీడీపీ చరిత్రలోనే సరికొత్త రికార్డు అని, ఇది కార్యకర్తల కష్టార్జితమేనని అన్నారు. 2024 అక్టోబర్ 26 నుండి ఇప్పటి దాకా సొంతపనులు కూడా వదిలిపెట్టి పార్టీ కోసం కార్యకర్తలు కష్టపడడం వల్లే లక్ష మందిని పార్టీ సభ్యులుగా చేర్చుకోగలిగామన్నారు. కోవూరు గడ్డ పార్టీకి కంచు కోటగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఇదే స్ఫూర్తితో ఐకమత్యంగా పనిచేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో లోకేష్ బాబు సారథ్యంలో 2029లో కూడా టీడీపీకే విజయం చేకూర్చాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



## మంత్రులు కలసిన శుభవేళ!

నెల్లూరు జిల్లానుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మన మంత్రులు..రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణలు ఇటీవల సంక్రాంతి పండుగల శుభవేళ భేటీ అయ్యారు. మంత్రి నారాయణ నెల్లూరులోని ఆనం నివాసంలో రామనారాయణరెడ్డిని గౌరవపూర్వకంగా కలుసుకుని జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి విషయాలను చర్చించారు. దాదాపు గంటపాటు ఈ చర్చలు జరిగాయి. అంతేకాదు, ఆ తర్వాత కూడా ఇద్దరు మంత్రులూ నెల్లూరు నగరంలో పలుచోట్ల పర్యటించి, నగరాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను చర్చించి, అధికారులతో కలసి సమీక్షించారు కూడా. తన నివాసానికి వచ్చిన మంత్రి నారాయణను రామనారాయణ ఆత్మీయంగా స్వాగతించి సన్మానించారు.

### పాతిక లక్షల సొంత నిధితో..

## విరూపాక్ష దేవాలయం అభివృద్ధి!

**- మంత్రి నారాయణ**



ముత్తుకూరు మండలంలోని ఈపూరు గ్రామంలో వెలసివున్న పార్వతీ దేవి సమేత శ్రీ విరూపాక్ష స్వామి ఆలయాన్ని పాతిక లక్షల రూపాయల సొంత నిధిని వెచ్చించి అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఆ నిధికి మ్యాచింగ్ గ్రాంట్ మంజూరుకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో సంప్రదించి, ఆలయాన్ని మరింత శోభాయమానం చేస్తామన్నారు. ఈనెల 13న, భోగిపండుగ రోజున ఆయన తన కుటుంబసభ్యులతో కలసి విరూపాక్ష స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నో ఏళ్ళుగా ప్రతి భోగిపండుగకు ఈ ఆలయానికి వచ్చి పూజలు చేయడం తమకు ఆనవాయితీ అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. తమ తండ్రి ఒకప్పుడు ఈ ప్రాంతంలో కండక్టర్‌గా పనిచేసేవారని, అప్పటి నుంచి తాము ఈ ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకోవడం జరుగుతోందని మంత్రి వివరించారు. తొలుత మంత్రి నారాయణకు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

# చిరస్మరణీయులు.. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి



ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, విద్యాదాత స్వర్గీయ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి జయంతి కార్యక్రమం జనవరి 15న ఘనంగా జరిగింది. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, బాలకృష్ణారెడ్డి సేవలను కొనియాడారు. ఆయన స్థాపించిన విద్యాసంస్థల్లో వేలాదిమంది విద్యార్థులు చదువుకుని జీవితాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని, ఆ మహనీయుని సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తొలుత, కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను అప్పట్లో ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ పురస్కారాన్ని బహుకరించిందని, ముఖ్యంగా నిరుపేద విద్యార్థులెందరికో ఆయన విద్యాదానం చేశారని అన్నారు. ఆయన స్థాపించిన విద్యాసంస్థల్లో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారని, విద్యార్థులు ఆయన ఆశయాల బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ అధ్యాపకులు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# హరిత హోటల్ లోపాలపై నివేదిక ఇవ్వండి

## ఏపీ టీడీసీ ఛైర్మన్ డా.నూకసాని బాలాజీ ఆదేశం

నెల్లూరులోని ఏపీ హరిత హోటల్‌ను ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్ నిర్వహణలో లోపాలున్నాయని, అన్నిటినీ పరిశీలించి త్వరలో తనకు నివేదిక ఇవ్వాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. తొలుత హోటల్‌కి సంబంధించిన రికార్డులను, ప్రత్యేకించి గత ఆరు నెలల రూమ్ ఆక్యుపెన్సీ గణాంకాలను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న హోటల్ ఆధునీకీకరణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా హోటల్‌కు సంబంధించి ఆయన పలు లోపాలను గుర్తించారు. హోటల్ గదుల ఆక్యుపెన్సీ రేటు 40 శాతం కంటే తక్కువగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. ఆధునీకరణ పనులు వేగంగా జరగకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యం గమనించారు. రూమ్ ఆక్యుపెన్సీని మెరుగుపరచడానికి ప్రత్యేక వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించాలని అధికారులకు సూచించారు. సిబ్బంది పనితీరును మెరుగుపరచాలని ఆదేశించారు.

## 26న చెన్నైలో.. శ్రీ త్యాగరాజ సంకీర్తనార్చన

వేదవిజ్ఞాన వేదిక (చెన్నై), శ్రీవాణి-శ్రీసిటీ సాహిత్య సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న 'శ్రీ త్యాగరాజ సంకీర్తనార్చన' కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరుగనుంది. ఆదివారం సాయంత్రం 6,30 గంటలకు చెన్నై టీనగర్‌లోని గోదావరి హోల్, ఆంధ్రాక్లబ్ వేదికగా జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో సాహిత్యాభిమానులు, భక్తులందరూ పాల్గొనాలని వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఎన్‌బికెఆర్‌లో యువజనోత్సవం

విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 12న జాతీయ యువజన దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, స్వామి వివేకానంద దేశంలోని యువతకు స్ఫూర్తిదాయకమైన మహానుభావుడని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

# యువత సన్మార్గంలో నడవాలి

నేటి సమాజంలో యువత సన్మార్గంలో నడవాలని, క్రమశిక్షణాయుత సత్‌ప్రవర్తన పెంపొందించుకుని దేశ భవితకు తోడ్పడాలని నెల్లూరులోని శ్రీ రామచంద్ర మిషన్ జోనల్ కోఆర్డినేటర్ డా.ఎం వెంకటకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని స్థానిక పద్మావతి సెంటర్‌లోని శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో యోగ సాధన, ధ్యానం ప్రాధాన్యతను ఆయన వివరించారు. వివేకానందుని జీవితంలోని కొన్ని సన్నివేశాలను విద్యార్థులు నాటికల రూపంలో ప్రదర్శించారు. అనంతరం యువతకు క్యారమ్స్, షటిల్, టగ్ ఆఫ్ వార్, క్విజ్ పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, విశ్రాంత ఎంపీడీఓ నరసింహారెడ్డి, శ్రీ రామచంద్ర మిషన్ రీజనల్ ఫెసిలిటేటర్ ఎం.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నృసింహస్వామి సేవలో.. నారాయణ దంపతులు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దంపతులు ఇటీవల నెల్లూరు రూరల్‌లోని నరసింహకొండపై వెలసివున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామిని ఉత్తర ద్వార దర్శనం ద్వారా దర్శనం చేసుకున్నారు. తొలుత ఆలయ కార్యనిర్వహణాధికారి గోపి, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు నారాయణ దంపతులను ఆలయమర్యాదలతో ఘనంగా స్వాగతించారు. అనంతరం, మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, 1979 నుండి ప్రతి ఏడాది ముక్కోటి ఏకాదశి రోజున తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి పూజలు చేయడం, ఉభయదాతగా సేవలు చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నామన్నారు. మంత్రి ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ విజేత, వీరబ్రహ్మగుప్తా, కళ్యాణి గుప్తా, మంత్రి కుటుంబ సభ్యులు వెన్నెల పాల్గొన్నారు.



# మరో ఏడుగురికి ట్రైసైకిల్స్

## దివ్యాంగులను ఆదుకున్న.. విపిఆర్ ఫౌండేషన్



ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని 155 మంది దివ్యాంగులకు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా బ్యాటరీతో నడిచే ఎలక్ట్రికల్ ట్రైసైకిల్స్‌ను ఇటీవల ఉచితంగా అందచేసి తమ ఉదారతను చాటుకున్నారు వేమిరెడ్డి దంపతులు. అదేవిధంగా, ఈనెల 15న నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లోని తమ నివాసంలో ఇందుకూరుపేట, విడవలూరు మండలాలకు చెందిన మరో ఏడుగురు దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందచేశారు. దీంతో, దివ్యాంగులు వారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

కోవూరు నియోజకవర్గంలోని పలువురు అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన నగదును నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు నెల్లూరులోని తమ నివాసంలో పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఇప్పటి వరకు 7 విడతలుగా 40 మంది అనారోగ్య పీడితులకు 85 లక్షల 65 వేల 387 రూపాయలు మంజూరయ్యాయని, 7వ విడతలో 11 లక్షలా 64వేలా 658 రూపాయలు విడుదలయ్యాయని వారు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల పక్షపాతి అని చెప్తూ, ఆ సాయాన్ని వారు బాధితులకు అందజేశారు.

## ఎస్ఆర్‌కె విశ్వసాయిలో..
# సంక్రాంతి సంబరాలు



నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న డాక్టర్ ఎస్ఆర్‌కె విశ్వసాయి స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పండుగ వేడుకల్లో తొలుత కవయిత్రులు, పాఠశాల విద్యార్థులు సంక్రాంతి భోగి మంటలు వేసి, శ్రీకృష్ణ భగవానునికి ప్రసాదాలు నివేదించారు. అనంతరం కోలాటంతో సందడి చేశారు. కవయిత్రులు ఈ సందర్భంగా కవితలు, పద్యాలు చదివి విద్యార్థులకు తెలుగుభాష పట్ల అభిమానం కలిగించారు. నవ్యాంధ్రుల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజుల సుభద్రాదేవి మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ మహిళలకి ప్రత్యేకంగా తమ కుటుంబ సభ్యులతో, బంధువులు, స్నేహితులతో ఆనందంగా గడిపే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. సంప్రదాయబద్ధంగా పండుగలు నిర్వహించు కోవడం మనకో ఆనవాయితీ అని అంటూ అందరికీ సంక్రాంతి శుభా కాంక్షలు చెప్పారు. ప్రముఖ కవయిత్రులు పాతూరు అన్నపూర్ణ, సందడి అరుణ. నజ్మా, సుందరి, హర్షవర్ధని, ప్రసన్నలక్ష్మి, జయలక్ష్మి, నాగేశ్వరమ్మ, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

# ప్రైవేటు బస్సులకు అనుమతిస్తాం



నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని ఇతర పట్టణాల్లో ప్రైవేటు బస్సులు నడిపేందుకు ఆసక్తి కలిగినవారు ముందుకు వస్తే వారికి వెంటనే అనుమతులిస్తామని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఇటీవల కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రాంతీయ రవాణా ఆధారిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నెల్లూరు నగరంలో ఇప్పటికే పర్మిట్ ఉన్న రూట్లు, కొత్త రూట్లలో సిటీ బస్సులను నడిపేందుకు ప్రైవేట్ అపరేటర్లు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. నెల్లూరు నగరంతో పాటు రూరల్ పరిధిలో ప్రతిపాదించి.. ఇప్పటికే అనుమతి ఉన్న 7 రూట్లలో, కొత్తగా అనుమతి కోరివున్న మరో 7 రూట్లలో ప్రైవేటు బస్సు సర్వీసులు నడిపేందుకు ఆ దరఖాస్తులను జిల్లా కమిటీ ఆమోదిస్తూ, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. ఆర్టీసీ వారు కూడా టౌన్ సర్వీసులు నడపాలని, ప్రభుత్వ-ప్రైవేటు విభాగాల వారు ప్రజలకు సేవ చేసేందుకు పోటీ పడాలని కోరారు. సమావేశంలో ఉప రవాణా కమిషనర్ చందర్, ఆర్టీఓ సిరిచందన, జిల్లా ప్రజా రవాణా అధికారి మురళీబాబు, ఆర్టీసీ అధికారులు, దరఖాస్తు చేసుకున్న ప్రైవేట్ బస్సుల ఆపరేటర్లు పాల్గొన్నారు.

# వాత్సల్యకు..లక్ష విరాళం



నెల్లూరులోని జనహిత-వాత్సల్య అనాథ శరణాలయానికి స్థానిక ప్రముఖ వైద్యులు టీవీ కోటేశ్వర రావు-డాక్టర్ టీ.లక్ష్మి దంపతులు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. వాత్సల్య ఆర్గనైజర్ జీవీ సాంబశివరావుకు ఈనెల 12న ఆ విరాళం చెక్కును అందజేశారు. తన పుట్టినరోజు సందర్భంగా వాత్సల్య చిన్నారులకు ఈ విరాళమిచ్చానని డాక్టర్ కోటేశ్వర రావు చెప్తూ, శుభకార్యాలు, పుట్టినరోజుల సందర్భాల్లో ఆ వేడుకలను ఆడంబరంగా జరుపుకోకుండా నిరుపేదలకు సాయం అందించడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు.

# భక్తిశ్రద్ధలతో..భోగి కల్యాణం



ధనుర్మాస వ్రతం పూర్తయిన సందర్భంగా ఈనెల 13న నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో నయనానందకరంగా భోగి కల్యాణం నిర్వహించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ ఉత్సవంలో భాగంగా తొలుత ప్రాకారోత్సవం, గోదాదేవి-రంగనాథస్వామిలకు ఎదురుకోలు ఉత్సవం చేపట్టి, ఆ తర్వాత కన్నులపండువగా కల్యాణోత్సవం చేశారు. ఈ ఉత్సవానికి కొండేటి పెంచలయ్య-లలితాకుమారి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మంచికలపాటి శ్రీనివాసులు పర్యవేక్షించారు.

# ఘనంగా..వడ్డే ఓబన్న జయంతి

రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 10న తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఇటీవల నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కనభవన్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. డిఆర్‌ఓ ఉదయ భాస్కరరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి, పలువురు వడ్డెర సంక్షేమ సంఘ నాయకులు పాల్గొని ఓబన్న దేశభక్తిని స్మరించుకున్నారు.

# 'నారాయణ'లో సంక్రాంతి వేడుకలు

- పాల్గొన్న మంత్రి నారాయణ సతీమణి రమాదేవి



నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. మహిళా శక్తి టీమ్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా సంబరాల్లో సుమారు 450 మంది మహిళలు పాల్గొన్నారు. కుర్చీలాట, పరుగుపందెం, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సంబరాల్లో పాల్గొన్న రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని చెప్పారు. మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. అనంతరం, క్రీడా పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులందజేశారు. ఈ సందర్భంగా హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. హరిదాసులకు కానుకలు, బియ్యం సమర్పించుకున్నారు. తెలుగుదేశం మహిళా నాయకురాలు, మాజీ మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసి విజేతారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు రేవతి, విజయ, శ్రీలక్ష్మి, జానకి తదితరులు పాల్గొన్నారు.

# 'నెరసం' కవి సమ్మేళనం



సంక్రాంతి సందర్భంగా నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) ఆధ్వర్యంలో ఈనెల 11న కవిసమ్మేళనం జరిగింది. పలువురు కవులు సంక్రాంతిని స్వాగతిస్తూ కవితాగానం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. జిల్లా గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి నెరసం అధ్యక్షుడు ఎ.జయప్రకాష్ అధ్యక్షత వహించారు. నెరసం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, సాహితీవేత్తలు చీమకుర్తి వెంకటేశ్వరరావు, పోలాప్రగడ లక్ష్మీనరసింహం,చలంచర్ల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొని సంక్రాంతి పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. కవులు, కవయిత్రులు షేక్ నజ్మా, భారతి, అరుణ సందడి, శశికళ, గీతాంజలి, శ్రీమన్నారాయణ, శ్రీనివాసులు, మాటేటి రత్నప్రసాద్, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కవులు కవయిత్రులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

## ముక్కోటి పండుగ రోజున..
# భక్తులకు డ్రై ఫ్రూట్ లడ్డూల ప్రసాదం



ముక్కోటి పండుగను పురస్కరించుకుని నెల్లూరులోని శ్రీరామ హనుమాన్ భక్తబృందం వారు భక్తులకు డ్రై ఫ్రూట్ లడ్డూలను ప్రసాదంగా అందజేశారు. స్థానిక రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవాలయంలో ఈనెల 10న వైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు, చీరాల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 55వేల లడ్డూలను పంపిణీ చేశారు. రంగనాథాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు ఈ ప్రసాద వితరణను ప్రారంభించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ఇఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, భక్తబృందం సభ్యులు పార్దస్ బాలాజీ, సాయిబాబా, శ్రీనివాసులు, మోహిత్, బాలసుబ్రహ్మణ్యం, సుబ్బారావు, చిరంజీవి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# పురాతన ఆలయాలను పునర్నిర్మిస్తాం

## నవాబుపేట శివాలయం, ధర్మరాజస్వామి దేవాలయాలకు పూర్వ వైభవం తెస్తాం

**- మంత్రులు రామనారాయణ, నారాయణ వెల్లడి**



నెల్లూరులో పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుట్టనున్నామని, అందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణలు చెప్పారు. ఈనెల 14న వారు దేవాదాయశాఖ అధికారులతో ఆలయాల స్థితిగతులను సమీక్షించారు. ముందుగా నవాబుపేటలోని పురాతనమైన శ్రీ భ్రమరాంబికాదేవి సమేత శ్రీ మల్లేశ్వర స్వామి దేవాలయం, ధర్మరాజస్వామి దేవాలయాల పునర్నిర్మాణాలకు కృషి చేస్తున్నామని మంత్రులు తెలిపారు. ఆలయాల పునర్నిర్మాణం ఆగమ శాస్త్ర నియమాలను అనుసరించి జరగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించి ఉన్నారని, ఆమేరకు ఆలయాల పునర్నిర్మాణాలను చేపడతామని వారు వివరించారు. దేవాలయ భూములను, స్థలాలను కొంతమంది ఆక్రమించుకున్నారని, వారికి ఆరునెలల గడువు ఇచ్చి ఖాళీ చేయాలని ఆదేశాలిచ్చామని చెప్పారు.

### 'బోడిగాడితోట'.. పేరు మారుస్తాం..

నెల్లూరు స్మశానానికి ఉన్న 'బోడిగాడి తోట' అనే పేరును మార్చి మంచి పేరుతో నామకరణం చేయిస్తామని మంత్రి అనం రామనారాయణరెడ్డి అన్నారు. ఈనెల 14న మంత్రి నారాయణతో కలసి ఆయన ఆ స్మశానవాటికను సందర్శించారు. ఇక్కడ శివునికి మంచి ఆలయం కూడా నిర్మించాలని గతంలో ఎమ్మెల్యేగా ఉన్న స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి అంటుండే వారని, ఆ కార్యాలను నెరవేర్చాలని స్థానికులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. ఆమేరకు వచ్చే సంక్రాంతికల్లా స్మశాన వాటిక పేరు మార్చి, శివుని విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కృషిచేస్తామని మంత్రులు వారికి చెప్పారు.

# చంద్రబాబు పాలనలో రైతులు సుభిక్షం!

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ప్రత్యేకించి మత్స్యకారులు కూడా ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఈనెల 15న కనుమ పండుగ సందర్భంగా విడవలూరు మండలం రామతీర్థం సమీపంలోని వెంకటనారాయణపురంలో మత్స్యకార కుటుంబాలతో కలిసి పోలేరమ్మ పొంగళ్ళ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా తలపై పొంగలి కుండ పెట్టుకొని పోలేరమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పించి అమ్మవారి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంతమ్మ మాట్లాడుతూ, తాను మొన్నటి ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించడంలో మత్స్యకార సోదర సోదరీమణుల కృషి ఉందన్నారు. రామతీర్థం నుంచే తాను తొలి ఎన్నికల ప్రచారం చేసిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. కోవూరు నియోజకవర్గ ప్రజలందరికీ ఆమె సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు.

# అసమానతలు లేని సమాజ స్థాపనే డా. అంబేడ్కర్ లక్ష్యం!

**• విగ్రహావిష్కరణలో ఎంపీ వేమిరెడ్డి**



అసమానతలు లేని సమాజ స్థాపనే డా.అంబేడ్కర్ లక్ష్యమని, సమాజంలో అట్టడుగు వర్గాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించిన ఘనత కూడా ఆయనదేనని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు గ్రామంలో తన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో కలిసి డా.అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు డా.అంబేడ్కర్ గొప్పతనాన్ని తెలిపేలా ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించిన జగదీష్ మిత్రబృందాన్ని అభినందించారు. కొడవలూరు మండలంలోని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో దాదాపు 2 లక్షల కోట్లతో సెమి కండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌తో పాటు మరో 2వేల కోట్లతో లిథియం ఐకాన్‌బ్యాటరీ, ఇథనాల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు రానున్నాయన్నారు. ఉలవపాడు మండలం రామాయపట్నం వద్ద 95 లక్షల కోట్ల వ్యయంతో బీపీసీఎల్ రిఫైనరీ రానుందని, ఈ భారీ పరిశ్రమల రాకతో జిల్లాలో దాదాపు 40వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. దామరమడుగు పాటూరు మధ్య ఉన్న కోవూరు కాలువపై బ్రిడ్జ్ నిర్మాణం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళామన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, నేడు రాజకీయాల్లో తనలాంటి మహిళలు రాణిస్తున్నారంటే అది డా. అంబేడ్కర్ కృషి ఫలితంగానే సాధ్యమైందన్నారు. బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, బుచ్చి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. తొలుత స్థానిక శివాలయాన్ని సందర్శించిన వేమిరెడ్డి దంపతులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

# నిరుపేద కుటుంబాలకి 'కంచి' దాతృత్వం

## అయిదుగురికి 10వేల వంతున సాయం



ప్రముఖ దాత..అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి తన దాతృత్వంలో ఇటీవల అయిదు నిరుపేద కుటుంబాల వారికి తన ఆధ్వర్యంలోని శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 10వేల రూపాయల వంతున మొత్తం 50వేల రూపాయల సాయం అందజేశారు. ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలో వివిధ కారణాలతో మరణించిన ఆ అయిదు నిరుపేద కుటుంబాల వారిని ఆయన ఈనెల 12న స్వయంగా కలసి పరామర్శించి ఆర్ధికసాయం అందించారు. ఆత్మకూరులోని 12వ వార్డుకు చెందిన పి.రమేష్, 17వ వార్డు నివాసి సయ్యద్ ముస్తఫా, 6వ వార్డులోని షేక్ సయ్యద్ సమీ అహ్మద్, 12వ వార్డుకు చెందిన ఎం.పెంచలయ్య, 5వ వార్డులోని షేక్ బీబీజాన్‌లు మరణించగా, వారి కుటుంబ సభ్యులకు ఆయన సాయం అందజేశారు.

అంతేకాదు, ఆత్మకూరు మండలంలోని కొత్తూరు వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన అప్పారావుపాళెంకు చెందిన ఉదయగిరి జస్వంత్ కుటుంబానికి కంచి పరమేశ్వరరెడ్డి 15 వేల రూపాయల సాయాన్ని పంపగా, ఆయన సూచనల మేరకు ఆ మొత్తాన్ని ఈనెల 12న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మృతుని కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, సోమవరపు యానాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ, వినయం..విజయానికి మార్గాలు

## ఐఐఐటీ-శ్రీసిటీ స్నాతకోత్సవంలో ఇస్రో ఛైర్మన్ సోమనాథ్



నిజాయితీ, వినయం.. విజయానికి మార్గాలని ఇస్రో ఛైర్మెన్ డాక్టర్ సోమనాథ్ చెప్పారు. ఈనెల 11న శ్రీసిటీలో ఐఐఐటీ–శ్రీసిటీ 2024 స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఆన్‌లైన్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని స్నాతకోపన్యాసం చేశారు. ఎవరైనా సరే, విజయం సాధించాలంటే ఆసక్తి, నిబద్ధత, ప్రావీణ్యం, సంకల్పం, ఏకాగ్రత, నేర్చుకునే సామర్థ్యం వంటి ఆరు ముఖ్య లక్షణాలు అవసరమని ఆయన వివరించారు. ఐఐఐటీ– శ్రీసిటీ మరియు ఇస్రో మధ్య భవిష్యత్ సహకారాలు ఉంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, అందుకు ఒక ఉమ్మడి పరిశోధన విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఐఐఐటీ–శ్రీసిటీ ఛైర్‌పర్సన్, జోహో కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ శ్రీధర్ వెంబు వర్చువల్‌గా సమావేశానికి అధ్యక్షత వహించారు. శ్రీసిటీ ఛైర్మెన్ శ్రీనిరాజు, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, క్యాటర్‌పిల్లర్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ భువన్ ఆనందకృష్ణన్, ఏడబ్ల్యుఎస్ ఇండియా చీఫ్ టెక్నాలజిస్ట్ శాలినీ కపూర్ తదితర సెనేటర్లు పాల్గొన్నారు. ఐదుగురికి పీహెచ్.డి, ఇద్దరికి ఎం.ఎస్., ఇద్దరికి ఎం.టెక్., 289 మందికి బీటెక్ పట్టాలను ఐఐఐటీ–శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.కార్తికేయన్ ప్రదానం చేశారు. బీటెక్ విభాగంలో మోహన్ సాయికృష్ణ (కంప్యూటర్ సైన్స్), దాచర్ల శ్రీజ(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)లు బంగారు పతకాలందుకున్నారు.





# జానకిరామ.. రామాయణం 48

- ఊటుకూరు జానకి రామారావు



దాని ప్రకారం నీకు రాజ్యం, నాకు అరణ్యవాసం మన తండ్రిగారు నిర్ణయించారు.

తండ్రి వాక్కునందు స్థిరంగా నిలచి నేను అరణ్యవాసం సీతా లక్ష్మణ సమేతంగా చేయ నిశ్చయించుకొన్నాను.

నీవు కూడా పట్టాభిషిక్తుడవై తండ్రిగారి సత్యవాదిత్వాన్ని నిలబెట్టాలి. ఆయనను ఋణవిముక్తుని చేయి.

భరతా నీవు నరులకు రాజువవ్వు, నేను వనంలోని మృగాలకు రాజునౌతాను. శీఘ్రమే తిరిగి వెళ్ళి పట్టాభిషిక్తుడవుకా!.

రాముడు భరతునితో ఇలా మాట్లాడుతుండగా.. బ్రాహ్మణోత్తముడైన జాబాలి మధ్యలో కల్పించుకొని...

రామా! చాలాబాగుందయ్యా నీవు చెప్పేది! ఎంత నిష్ప్రయోజనమైన ఆలోచన నీది.

ఎవడైనా గానీ ప్రాణి ఒంటరిగానే పుడుతున్నాడు, ఒంటరిగానే గిడుతున్నాడు !

ఎవడు ఎవడికి బంధువు?

ఎవడినుంచి ఎవడు ఏమి పొందుతున్నాడు?

నా తల్లి, నా తండ్రి అని అంటూ ఇంత ఉన్మత్తమైన ప్రేమ ఎందుకు? ఎవ్వడూ ఎవడికి ఏమీ కాడు!

ప్రయాణం చేసేటప్పుడు ఒక ఊరిలో రాత్రిపూట బస చేసినట్లు ఎక్కడ నుండి వచ్చాడో తెలియని మనిషికి తల్లి తండ్రి, బంధువులు, వీరుండే చోటు కూడా అలాంటిదే !

ఎందుకయ్యా హాయిగా రాజ్యాన్ని ఏలుతూ సుఖంగా ఉండకుండా "తండ్రిమాట" అంటూ అత్యంత కష్టమైన అరణ్యవాసాన్ని కౌగలించుకొంటావు!

ఏడి? దశరథుడు ఇప్పుడున్నాడా!

అతడిప్పుడు నీకేమీ కాడు, నీవతనికి ఏమీ కావు!

అసలు తండ్రి ఎవరు?

అతను బీజం మాత్రమే!.

తల్లి ఋతుమతి అయినప్పుడు శుక్లం, శోణితం కలువగా పురుషుడు జన్మిస్తున్నాడు. అంతే!

నిన్ను చూస్తే జాలికలుగుతుంది. ధర్మం,ధర్మం అంటూ పట్టుకొని పాకులాడుతున్నావు!

చచ్చినవారికోసం ఏవేవో తద్దినాలు పెడుతున్నారు. ఎంత అన్నం వృధా అవుతుందో వాటివల్ల!

నీవు ఇక్కడపెట్టే అన్నం అక్కడ అది నీ తండ్రిని చేరుతుందా!

దానాలివ్వమనీ, యజ్ఞాలు చెయ్యమనీ పనికిరాని మాటలు కొందరు మేధావులు చెపుతున్నారు.

రామా నాకు తెలిసి ఇక్కడ మనమున్న లోకమొక్కటే లోకం. పరలోకం లేదు, పాడు లేదు.

దానిని నీవు లెక్కపెట్టవలసిన పనిలేదు.

ఆనందంగా రాజ్యమేలుకో! ధర్మం అంటూ పట్టుకొని వేళ్ళాడకు.

జాబాలి మాటలు అధికమైన భక్తితో శ్రద్ధతో విని, చలించని బుద్ధితో ఇలా అన్నాడు రాముడు.

నీవు నా సంతోషాన్ని కోరి ఇప్పటివరకు పలికిన పలుకులు పైకి బాగానే కనబడతాయి కాని, అవి చేయకూడనివి, హితం కానటువంటివి అయినవి.

కట్టుబాట్లు గాలికి వదిలివేసి మంచి నడవడి, మంచి చూపు లేని మానవుడు సమాజంలో గౌరవం పొందజాలడు.

మనిషి నడవడికను బట్టే వాడు కులీనుడో కాడో, వీరుడో కాడో, పరిశుద్ధుడో కాడో చెప్పవచ్చు.

నేను పైకి మంచివాడిలా కనపడుతూ లోపల దుష్టత్వం నింపుకొని యుండవలెనా? నిజాయతీ అవసరంలేదా?

లోపల ఎన్నో దౌర్భాగ్యపు ఆలోచనలు పెట్టుకొని బయటకు గొప్ప శీలవంతుడిలా కనపడమంటావా?

గోముఖవ్యాఘ్రమని, పయోముఖవిషకుంభమనీ, తేనెపూసిన కత్తి అని లోకులు నన్ను ఆడిపోసుకోరా?

ప్రతిజ్ఞను మరచి ప్రవర్తిస్తే ఇంక నేను ఎవరికి మంచి మార్గం ఉపదేశించగలను? స్వర్గానికి చేరుకోగలనా?

ధర్మవర్తనం లేక రాజు స్వేచ్ఛావర్తనుడైతే ప్రజలు కూడా అదేవిధంగా ప్రవర్తించరా!

ఈ రాజధర్మం అతిపురాతనమైంది! సత్యస్వరూపమైంది, దీనిలో క్రూరత్వానికి తావులేదు.

రాజుకు సత్యమే ప్రధానం.

జాబాలీ! సత్యం మీదనే లోకం ప్రతిష్ఠితమై ఉంది.

**సత్యే లోకః ప్రతిష్ఠితః!**

ఈ లోకంలో సత్యమే ఈశ్వరుడు.

లక్ష్మి సత్యాన్నే ఆశ్రయించి ఉంటుంది.

సత్యాన్నిమించిన ఉత్తమధర్మం లేదు.

**సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరం పదమ్!**

నేను సత్యప్రతిజ్ఞకలవాడను. తండ్రి ఎదుట సత్యంపై శపథం చేసిన నేను, ఆయన ఆజ్ఞను పాలించకుండా ఉండలేను.

నా సత్యప్రతిజ్ఞను లోభంవలన కానీ, చిత్తభ్రమ వలనకానీ, తమోగుణమువలన కలిగిన అజ్ఞానము వలన కానీ భేదించను.

స్థిరచిత్తుడైన రాముడు ఇంకా ప్రసంగిస్తూనే ఉన్నాడు.

రాముడు గంభీరంగా చెపుతున్నాడు. గొంతులో ఒక స్థిరత్వం మాటలో పటుత్వం కలగలసి వస్తున్నాయి. ఆయన వాక్కులు దృఢంగా ఉన్నాయి..

నీచులు, క్రూరులు, పాపాత్ములు, దురాశాపరులు సేవించేటటువంటిది, అధర్మంతో నిండినదీ అయిన క్షత్రియ ధర్మాన్ని నేను పరిత్యజించెదను.

మనిషి చేసే పాపం, ముందు అతని మనసులో పుడుతుంది, ఆ తరువాత శరీరం ఆ పాపకర్మ చేస్తుంది.

నాలుక అబద్ధమాడుతుంది. ఈ విధంగా పాపం మూడు విధాలుగా ఉంటుంది.

ఒకటి.. మానసికం, రెండు.. శారీరికం, మూడు.. వాచికం.

జాబాలీ! నీవు శ్రేష్ఠము అని నాకు చెప్పినదంతా కూడా చెడ్డదే! నా తండ్రిగారి ఎదుట చేసిన ప్రతిజ్ఞ కాదని ఇప్పుడు భరతుడి మాటలను ఏల పాటించగలను?

నా తండ్రి ఎదుట చేసిన ప్రతిజ్ఞ స్థిరమైంది! అప్పుడు కైకేయీ దేవి కూడా సంతసించింది. నేను పరిశుద్ధుడనై, మిత భోజనం చేయుచు, పవిత్రమైన కందమూల ఫలములతో, పితృ దేవతలను తృప్తి చెందించుతూ, సంతుష్టి చెందిన పంచేంద్రియాలు కలవాడనై, కపటం విడనాడి శ్రద్ధావంతుడనై కార్యాకార్యాలు తెలుసుకుంటూ వనవాసజీవితం గడిపెదను.

దేవతలందరును ధర్మసమ్మతమైన శుభకార్యాలు చేయుట వల్లనే ఆయా పదవులు పొందగలిగారు... అని పలుకుతూ నాస్తికత్వంతో కూడిన జాబాలి మాటలను నిర్ద్వంద్వంగా ఖండించాడు రాముడు. అసలు నీలాంటి వారిని చేరదీసిన నా తండ్రిని నిందించ వలె, నిన్నుకాదు. సత్యం, ధర్మం, పరాక్రమం, భూత దయ, ప్రియవాక్కు, దేవబ్రాహ్మణ, అతిథుల పూజ.. ఇవి స్వర్గానికి మార్గాలని సత్పురుషులు చెపుతున్నారు.

రాముడి ఆగ్రహన్ని చూసిన జాబాలి, రామా! నేను నాస్తికుడను కాను, నిన్ను అయోధ్యకు మరల్చవలెననే ఉద్దేశ్యం తప్ప వేరే ఏదీ లేదు.

రాముడికి కోపం వచ్చిందని గ్రహించిన వశిష్ఠులవారు ఆయనకు ఇక్ష్వాకుల చరిత్ర అంతా తెలిపి, ఇక్ష్వాకులలో జ్యేష్ఠుడే రాజు! అదే ధర్మం అని తెలిపి శాంతింపచేశారు. అతి ప్రాచీనమైన మీ కుల ధర్మాన్ని నీవు చెరచవద్దు అని హితబోధ చేశారు.

రామా నేను నీకు, నీ తండ్రికి ఆచార్యుడను, నేను చెప్పిన విధంగా చేసినచో నీవు ధర్మమార్గాన్ని అతిక్రమించినవాడివి కాజాలవు... అని అన్నారు వశిష్ఠ మహర్షి.

రామా! భరతుడు చెప్పినట్లుగా నీవు అంగీకరించు. అది ధర్మవిరుద్ధం కానేరదు.

జనులంతా నీ కోసం ఎదురు చూస్తున్నారు అని వశిష్ఠ మహర్షి పలుకగా, ఆయనతో వినయంగా రాముడిలా అన్నాడు.

ఆచార్యా, పిల్లలు పుట్టినప్పటి నుండీ తల్లిదండ్రులు వారి ఆలనాపాలనా చూస్తూ సమయానికి స్నానపానాదులు చేయిస్తూ, వేళకు నిద్రపుచ్చుతూ వారికి సకలోపచారాలూ చేస్తారు. అలా సేవచేసిన తల్లిదండ్రుల ఋణం తీర్చుకోవడం ఎప్పటికైనా సాధ్యమవుతుందా?

నాకు జన్మనిచ్చిన తండ్రి ఎదుట చేసిన ప్రతిజ్ఞ వృధాగా పోనీయను అని స్థిరగంభీరంగా పలికాడు రామచంద్రుడు.

భరతుడికి కన్నీరు ఆగటంలేదు. అది వరదగోదావరి అయ్యింది. సుమంత్రుని పిలిచి ఇక్కడ నేలపై దర్భలు పరిపించు, అన్నగారు ప్రసన్నుడయ్యేంతవరకు నేను ఆయన ఎదురుగా ఆయనను అడ్డగించి కదలనీయను, ఇక్కడే పడుకొంటాను, అని పలికి సుమంత్రుడు రాముని వైపు చూస్తూ ఉండటం గమనించి, తానే స్వయంగా దర్భలు తెచ్చుకొని నేలపై పరుచుకొన్నాడు.

.. (సశేషం)

# కాలిఫోర్నియా కార్చిచ్చు గుణపాఠం కావాలి

మనసులో మాట 28

అమెరికాలోని కాలిఫోర్నియాలో కార్చిచ్చు సామాన్య ప్రజల గుండె మంటను రగిలించింది. ఈ ప్రకృతి విపత్తుకు ప్రధాన కారణం ప్రకృతి వనరులను విచ్చలవిడిగా దోచుకుంటున్న కొంతమంది కుబేరులేనని సామాన్య ప్రజలు ఆగ్రహ జ్వాలలు వ్యక్తం చేస్తున్నారు. కాలిఫోర్నియాను కొద్ది రోజులుగా కార్చిచ్చు చుట్టుముట్టింది. పాలిసేడ్స్, ఈటన్ కార్చిచ్చుల కారణంగా కొద్ది సంఖ్యలో ప్రజలు మరణించారు. వేల నివాసాలు, వ్యాపార నిర్మాణాలు భస్మీపటలమయ్యాయి. వేల ఎకరాల అటవీప్రాంతం తగలబడిపోయింది. లక్షల మందిని తరలిస్తున్నారు. అగ్నిమాపక దళాలు ఎంతగా ప్రయత్నించినా మంటలను పూర్తిగా అదుపులోకి తేలేకపోతున్నాయి. కార్చిచ్చుకు మూలకారణం ఏదైనా, అదుపు చేయలేని విధంగా అగ్నికీలలు విస్తరించడానికి కొంతమంది కుబేరులు జల వనరుల దోపిడీకి పాల్పడటం కూడా ఒక కారణమని తేలడంతో ఆ ప్రాంతంలోని సామాన్య ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

లాస్‌ఏంజెలెస్ ప్రాంతంలో నీటి కొరత కారణంగా ఫైర్ హైడ్రంట్స్ పనిచేయక పోవడంతో మంటలు అదుపులోకి రావట్లేదు. వరుసగా మూడేళ్లుగా ఎన్నడూ లేనంత నీటి కరువు నమోదవడంతో.. స్థానిక అధికారులు 2022లో నీటి సంరక్షణ కోసం కఠిన నిబంధనలు అమల్లోకి తెచ్చారు. ఇంటి ఆవరణలోని తోటలకు వారానికి రెండుసార్లు, అదీ ఒక్కో తడవకూ ఎనిమిది నిమిషాల చొప్పున మాత్రమే నీరు పెట్టాలనే నిబంధన వాటిల్లో ముఖ్యమైనది. కానీ, హాలీవుడ్ ప్రముఖుల్లో ఒకరైన కిమ్ కర్దాషియన్ తన ఇంటి ఆవరణలోని తోటకు వాడాల్సినదానికన్నా అదనంగా ఎనిమిది లక్షల లీటర్లకుపైగా నీటిని వాడారు. లాస్ ఏంజెలెస్‌లో నివసించే ఇంకా చాలామంది సెలబ్రిటీలు, సంపన్నులు కూడా విచ్చలవిడిగా నీటిని వాడేస్తున్నారని



ఆరోపణలు వచ్చాయి. దీంతో సామాన్యుల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. మరోవైపు ప్రస్తుత కార్చిచ్చు కారణంగా లక్షలమంది ప్రజలు తమ ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతుంటే.. ప్రాణాలు కాపాడే నీటివనరులను కేవలం విలాసవంతమైన భవనాలను కాపాడుకోవడానికి మళ్లించాలనుకుంటున్నారని కూడా సామాన్య ప్రజలు మండిపడుతున్నారు. వారి ఆగ్రహంలో తప్పేమీలేదు. అమెరికాలోనే కాదు, ప్రపంచంలో చాలాచోట్ల ఇదే పరిస్థితి. కొద్దిమంది విలాసాల కోసం, ప్రాణావసరమైన ప్రకృతి వనరులను విచ్చలవిడిగా వాడేస్తున్నారు. కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి.

మనదేశంలోనూ నీటి వనరులు అడుగంటుతున్నాయి. గత ఏడాది బెంగుళూరు ఎదుర్కొన్న నీటి కొరత భవిష్యత్తు చిత్రాన్ని కళ్ళ ముందు పెట్టింది. బెంగళూరు మొన్నటి వేసవిలో నీటికి కటకటలాడిపోయింది. ఆ నగరంలో నీటి సంక్షోభానికి భూగర్భ జలాలు పడిపోవడమే కారణం. భారత్ ఇప్పుడు ప్రపంచంలో అత్యంత నీటి ఒత్తిడి ఎదుర్కొంటున్న దేశాల్లో ఒకటిగా నిలిచింది. తాజా అధ్యయనం ప్రకారం 2050 నాటికి దేశంలోని సగం జిల్లాలు నీటి కొరతను ఎదుర్కోనున్నాయి. ఆ సమయానికి తలసరి నీటి లభ్యత 15శాతం తగ్గుతుందని అంచనా. అదే సమయంలో జల వనరుల డిమాండ్ 30శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. డిమాండ్–సరఫరాల మధ్య భారీ అంతరం ఏర్పడనుంది. ఫలితంగా నీటిఎద్దడి మరింత తీవ్రతరమై నీటి కోసం గొడవలకు దిగే పరిస్థితి తలెత్తవచ్చని ఆందోళన వ్యక్తం అవుతోంది.

భూతాపం, వాతావరణ మార్పులు వంటి ప్రకృతి ప్రకోపాలను, వాటి పరిష్కార మార్గాలను కాసేపు పక్కనపెడితే, నీటి సంరక్షణ కోసం మన స్థాయిలో చేయాల్సిన పనులు, చేయకూడని పనులు కొన్ని ఉన్నాయి. పొదుపుగా నీటిని వాడుకోవాలి అన్న స్పృహ ప్రతి ఒక్కరిలోనూ కలగాలి. చెరువులు, కుంటలు, సరస్సులు, నదులు, వాగులు, వంకలు వంటి విలువైన జల వనరులు కబ్జాకు గురవుతున్నాయి. వెంటనే వాటిని అరికట్టాలి. పారిశ్రామిక వ్యర్థాలను నిబంధనల ప్రకారం ట్రీట్మెంట్ చేయకుండా, డబ్బును ఆదా చేసుకోవడం కోసం విలువైన జల వనరుల్లో కలిపేస్తున్నారు. నీటి వనరులు కబ్జాకు గురికాకుండా, అవి కలుషితం కాకుండా స్థాయిలో ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై ఉండాలి. ప్రభుత్వాలు కూడా గట్టి చర్యలు తీసుకోవాలి. తోటలకు నీటిని పునర్వినియోగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం చాలా ఉంది. ప్రకృతి వనరులను పరిరక్షించుకోకపోతే, సామాన్యులకు వాటిని అందుబాటులో ఉంచకపోతే వారి ఆగ్రహ జ్వాలలు బడబాగ్నిని మించిపోతాయన్న సంగతిని సమాజంలో ఉన్నత స్థాయి వ్యక్తులుగా చలామణి అవుతున్న వారు గుర్తుంచుకోవాలి. కాలిఫోర్నియా కార్చిచ్చు ప్రపంచంలో ప్రతి ఒక్కరికి గుణపాఠం కావాలి.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# శ్రీసిటీలో.. వైభవంగా వైకుంఠ ఏకాదశి!

## అలరించిన 'సుందరకాండ' హరికథా గానం



వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఇటీవల శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వేడుకలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనడంతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ధనుర్మాసంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు 'ఉత్తరద్వార దర్శనం' ఏర్పాటు చేశారు. శ్రీసిటీ శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ 'హరికథా దురంధర' డా. వై.వెంకటేశ్వర్లు భాగవతార్ నేతృత్వంలోని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులచే నిర్వహించిన 'సుందరకాండ' హరికథా గానం అందరినీ అలరించింది. సంగీత విద్వాంసులు రెడ్డి శంకర్(తబలా), మురళి(కీబోర్డ్), జి.శ్రీనివాసులు(శృతి), జయచంద్ర (రిథమ్ పాడ్) తదితరులు పాల్గొన్నారు. అనంతరం, కళాకారుల బృందానికి అభినందనలు తెలిపిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వారందరినీ ఘనంగా సత్కరించారు. వైకుంఠ ఏకాదశి పూజా కార్యక్రమాలలో శ్రీసిటీ పరిసర గ్రామాల ప్రజలు చురుగ్గా పాల్గొని విజయవంతం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. భక్తులందరికీ నిర్వాహకులు స్వామివారి తీర్థ, అన్నప్రసాదాలు అందజేశారు.

# స్మైల్ వాకర్స్..కొత్త కార్యవర్గం

నెల్లూరులోని స్మైల్ వాకర్స్ అసోసియేషన్‌కు ఈనెల 12న కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షునిగా ఎస్‌డీ ముదార్, కార్యదర్శిగా ఎస్‌కె అజ్మీర్‌బాషా, కోశాధికారిగా బైసాని వెంకటరమణ, గౌరవాధ్యక్షునిగా గణపం రాజగోపాల్‌రెడ్డి, న్యాయ సలహాదారుగా ఎస్‌కె యజ్దానీలను ఎన్నుకున్నారు. వైస్‌ప్రెసిడెంట్‌గా కెక మధుసూదన్‌రావు, జాయింట్ సెక్రటరీగా రామానాయుడు, జాలీ వాకర్‌గా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి పాల్గొని కొత్త కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘాల నాయకులు నలుబోలు బలరామయ్యనాయుడు, కిలారి తిరుపతినాయుడు, వేలూరి రంగారావు, శ్రీనివాసులు, కనకట్ల రఘురాం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న రాష్ట్రస్థాయి..ఎడ్ల బండ్ల పందాలు

## ప్రథమస్థానంలో అల్లూరు, ద్వితీయస్థానంలో పొట్టేపాళెం



సంక్రాంతి పండుగ సందర్భంగా కోవూరులో ఈనెల 13న జరిగిన ఎడ్ల బండ్ల పరుగు పోటీలు రసవత్తరంగా జరిగి అందరినీ ఆకట్టుకున్నాయి. కోవూరులోని కొత్తూరు రోడ్డు ప్రాంతంలో అరవింద రైసుమిల్లు వద్ద రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 40 ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. కృష్ణాజిల్లా, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లా తదితర ప్రాంతాల నుంచి కూడా ఎడ్లబండ్లు ఈ పోటీల్లో పాల్గొనడంతో, ఈ పోటీలను చూసేందుకు పెద్దఎత్తున ప్రజలు, యువత ఎంతో ఉత్సాహంతో తరలివచ్చారు. దాదాపు గత మూడు దశాబ్దాలకు పైగానే కోవూరు బండ్ల సంఘం, రైతు సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి.

### అల్లూరు ఎడ్లకు 40వేల బహుమతి..

ఈ పోటీల్లో 3 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 5.17నిమిషాల్లో చేరుకుని ఎస్ఎస్ బ్రదర్స్‌కి చెందిన అల్లూరు పోలేరమ్మ ఎడ్లబండి ప్రథమ స్థానంలో నిలిచి, 40వేల రూపాయల బహుమతిని గెలుచుకుంది. నిర్వాహకులు విజేతలను అభినందించి ట్రోఫీతో పాటు నగదు బహుమతిని అందజేశారు. నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెంకి చెందిన వరసిద్ధి వినాయక ఎడ్లు 5.25 నిమిషాల్లో గమ్యస్థానం చేరి ద్వితీయ బహుమతిని సాధించి, తమ యజమానులకు 25వేల రూపాయల బహుమతిని సాధించిపెట్టాయి. ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం శ్రీ చాముండేశ్వరి సీఫుడ్స్‌కు చెందిన ఎడ్లు 5.29 నిమిషాలతో మూడవ స్థానం కైవసం చేసుకున్నాయి. 20వేల రూపాయలను మూడవ బహుమతిగా నిర్వాహకులు అందజేశారు. అదేవిధంగా, కోవూరు మండలం పాటూరు పల్లిపాళెం గ్రామానికి చెందిన పోలేరమ్మతల్లి ఎడ్లబండి నాల్గవ స్థానంలో నిలిచి 15వేల రూపాయల బహుమతిని, నెల్లూరు రంగనాయకుల పేటకు చెరందిన శ్రీ రంగనాథస్వామి ఎడ్లబండి 5వ స్థానం సాధంచి 10వేల రూపాయల బహుమతిని గెలుచుకున్నాయి. పలువురు దాతలు వారి కుటుంబసభ్యుల జ్ఞాపకార్థం విజేతలకు పెద్దమొత్తాల్లో ఈ నగదు బహుమతులివ్వడం విశేషం. స్థానిక ప్రముఖులు వేమారెడ్డి భరత్‌రెడ్డి, వేమారెడ్డి సునీల్‌రెడ్డి, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నీలపరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి, శివుని నరసింహులురెడ్డితో పాటు రైతు సమన్వయ కమిటీ ప్రతినిధులు పొబ్బా మల్లికార్జునరెడ్డి, దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, ఉబ్బయ్య, శ్రావణ్‌రెడ్డి, ఎం.సుధాకర్, వై.మదన్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. పోటీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, కొడవలూరు సీఐ సురేంద్రబాబు, ఎస్ఐలు రంగనాథ్‌గౌడ్, అంజిరెడ్డి, సిబ్బంది ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి గట్టి చర్యలు తీసుకున్నారు.

తిరుపతి జిల్లా

# గూడూరు డివిజన్

## తాళమ్మకి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



గూడూరు పట్టణం పంబలేరు వాగు సమీపంలో వెలసిన గూడూరు గ్రామ దేవత శ్రీ తాళమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. సంక్రాంతి పండుగలో భాగంగా శ్రీ తాళమ్మ అమ్మవారి గ్రామోత్సవం భోగి పండుగ ముందురోజు సాయంత్రం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆలయాన్ని సందర్శించారు.

## శ్రీకృష్ణ గోశాలలో గోపూజ



ఈ నెల 15వ తేదీ కనుమ పండుగను పురస్కరించుకొని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో, బూడిదవాక వెంకటరత్నమాచారి – ప్రభావతి దంపతుల ఆతిథ్యంలో వరగలి క్రాస్‌రోడ్డులోని సిద్ధారెడ్డి కోల్డ్ స్టోరేజీ వద్ద ఉన్న శ్రీకృష్ణ గోశాలలో గోపూజను మేళతాళాలతో శోభాయమానంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటరత్నమాచారి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రగతి సేవా ఉపాధ్యక్షులు బండి ధనంజయరెడ్డి, శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మయూరి శ్యామ్‌యాదవ్ పాల్గొన్నారు.

## విశేషాలంకారంలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ



తూర్పు కనుపూరులోని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 14న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మూలమూర్తులకు అభిషేకం నిర్వహించారు. భక్తులు వెయ్యి కల్లు కుండలతో, వేపాకు చీరలతో పొంగళ్ళు పెట్టుకొని అమ్మవారుని విశేషంగా దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పంచ హారతులు, పల్లకి సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్, ధర్మకర్తలమండలి, కార్య నిర్వాహణాధికారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## పొణకా దంపతులకు ఎం.ఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ శుభాకాంక్షలు



గూడూరు పట్టణంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త, పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పొణక శివకుమార్‌రెడ్డి, దేవసేనమ్మ దంపతులను ఈ నెల 12న వారి స్వగృహంలో మొహమ్మద్ ఫక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మగ్దూమ్ మొహిద్దీన్, ట్రస్ట్ సభ్యులు షేక్ కాలేషా, సయ్యద్ అల్తాఫ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మంచి మనసున్న పొణకా దంపతులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నామని అన్నారు.



## భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం

విద్యుత్ ఛార్జీలు పెంపునకు వ్యతిరేకంగా రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు సి.పి.ఎం, సి.ఐ.టి.యు, రైతు సంఘం, ప్రజా సంఘాల నాయకులు గూడూరులోని ఒకటవ పట్టణం, రెండవ పట్టణం పరిధిలోని పది ఏరియాలలో కరెంటు బిల్లులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. గూడూరు సీపీఎం ఆర్గనైజర్ జోగి శివకుమార్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంపుదల లేదంటూనే కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతూ ఉందని, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన నియంత్రణ మండలి, ప్రభుత్వం పంపిణీ సంస్థల ప్రతిపాదనలను గుడ్డిగా ఆమోదించడం, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా కొత్త భారాలు నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సి.ఐ.టి.యు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, కార్యదర్శి ఎస్.సురేష్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య, గోను మదన్, బల్లి లవకుమార్, చిన్నయ్య పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

సంక్రాంతి పండుగని పురస్కరించుకుని ఈ నెల 12న సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గిద్దలూరు సులోచనమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు గిద్దలూరు రాధాకృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో ధూర్జటినగర్‌లో వందమంది పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా సుమతిరెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డిలు విచ్చేయగా, శ్రీకిరెడ్డి మధురెడ్డి, పేట వెంకటకృష్ణారెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# స్వపక్షంలో విపక్షంగా జనసేనాని

(మొదటిపేజీ తరువాయి)

భక్తులకు క్షమాపణ చెప్పి తీరాల్సిందే అంటూ ప్రతిపక్ష నాయకుడి తరహాలో నిలదీశారు. ఫలితంగా ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ఎగసిన ఆగ్రహ జ్వాలను తన వరకు రాకుండా తెలివిగా వ్యవహరించారు. అదే సమయంలో ప్రధాని మోడీకి రోజురోజుకూ దగ్గరవుతూ కేంద్రం వద్ద పరపతిని పెంచుకుంటూ పోతున్నారు. ఫలితంగా 2029 ఎన్నికల్లోనూ పవన్ కేంద్రంగానే రాజకీయాలు నడుస్తాయనే ప్రచారం జోరందుకుంటోంది. ఐదేళ్ల కూటమి ప్రభుత్వ పాలన తర్వాత జగన్‌ను టార్గెట్ చేస్తూ విమర్శించే పరిస్థితి ఉండదని, అందుకే ఇప్పటి నుంచే కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, తప్పులను తన కంట కుండా పవన్ జాగురూకతతో ముందు కెళ్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా పవన్ ముందుచూపు అచ్చమైన పొలిటికల్ పవర్ స్టార్‌ను తలపిస్తోందన డంలో సందేహం లేదు.

అవును.. ఎన్నికల ముందు తన పరిధిని తానే తగ్గించుకుని వాస్తవిక దృక్పథంతో 21 స్థానాలకే పరిమితమైనా 100 శాతం స్ట్రయిక్ రేట్‌తో ఏకంగా కుంభస్థలాన్నే కొట్టేశారు. విజయం కూటమిదే అయినా విజయబావుటా పట్టి నడిపించిన నాయకుడిగా.. అసలైన గేమ్ ఛేంజర్‌గా అందరి ప్రశంసలూ పొందారు. ఇక ప్రభుత్వంలో అయితే వన్ అండ్ ఓన్లీ అన్నట్లుగా యమ స్పీడ్‌తో దూసుకెళ్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి ఉపాధి గ్రామసభలు, విజయవాడ వరద బాధితులకు ఆరుకోట్ల అసామాన్య సాయం.. సమస్త సనాతనం అంటూ ప్రాయశ్చిత్త దీక్ష.. గూగుల్ తల్లి కూడా చూపని అటవీ గ్రామాల్లో అద్దాల్లాంటి రోడ్లు.. ఇలా తనదైన శైలిలో పాలనను పరుగులెత్తిస్తున్న పవన్ కళ్యాణ్ ప్రస్తుత రాజకీయాల్లో ఓ అసమాన శక్తి.. అనడంలో అతిశయోక్తి లేదు.!

## రాజకీయాలు తెలియదనే స్థాయి నుంచి..

సర్వకాల సర్వావస్థల్లో తప్పు జరిగితే ప్రశ్నించడం జనసేన నైజం.. ఇదీ పార్టీ ప్రారంభ కాలం నుంచి పవన్ చెబుతున్న మాట.అనుసరిస్తున్న బాట. 2014లో పార్టీని స్థాపించిన పవన్.. ఆ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా తెలుగుదేశం, బీజేపీ కూటమికి మద్దతు పలికి నిస్వార్థ నాయకుడిగా పేరుగడించారు. అయితే ఆ తర్వాత ఐదేళ్ల పాటు పార్టీ నిర్మాణంపై దృష్టిపెట్టకుండా కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారు. తర్వాత చివర్లో తెలుగుదేశం ప్రభుత్వాన్ని, బీజేపీ తీరును ఎండగడుతూ రాష్ట్రానికి ప్రత్యేకహోదా విషయంలో రెండు పార్టీలూ మోసం చేశాయని ఆరోపణలు గుప్పించారు. తర్వాత బహుజన్ సమాజ్‌వాదీ వంటి పార్టీలతో జట్టుకట్టి 2019 ఎన్నికల్లో బరిలో దిగారు. కానీ, వైఎస్ జగన్ ప్రభంజనంలో కేవలం ఒక్కసీటుకే పరిమితమై పార్టీ ఉనికే ప్రశ్నార్థకం అనే స్థాయికి చేరిపోయారు. ఏకంగా పవన్ కళ్యాణ్ కూడా తాను పోటీచేసిన రెండు స్థానాల్లో పరాజయం పాలయ్యారు. చివరికి జనసేన పార్టీ తరఫున గెలిచిన ఆ ఒక్క ఎమ్మెల్యే కూడా జగన్ వర్గంలో చేరిపోవడంతో పవన్ రాజకీయాలలో అనామకుడంటూ విమర్శకులు, నెటిజన్లు ఆడేసుకున్నారు. అసలు ఆయనకు రాజకీయాలే తెలియవని ఆయనో సీజనల్ స్టార్ అని.. మామిడి, నేరేడు పండ్ల తరహాలో అప్పుడప్పుడు మాత్రమే ఆంధ్రాకు వచ్చి రాజకీయాలు చేస్తారని, ఆయనకు పార్టీ నిర్మాణంపై దృష్టిలేదని కేవలం సంచలనాల కోసమే పార్టీని నడుపుతున్నారని దుమ్మెత్తి పోశారు.

## ప్యాకేజీ స్టార్ అంటూ హేళనలు..

ఇక తన పార్టీ ఆరంభ కాలం నుంచి వైఎస్సార్ సీపీని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రధాన ప్రత్యర్థిగా టార్గెట్ చేసుకుని జగన్‌ని, జగన్ పార్టీని ఓడించడమే తన లక్ష్యంగా నిర్దేశించుకున్నారు పవన్ కళ్యాణ్. కాబట్టే గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు జనసేనానిని అత్యంత నీచంగా విమర్శించారనే వాదనలున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ .. ఓ ప్యాకేజీ స్టార్ అని, పావలా స్టార్ అని చంద్రబాబు దగ్గర ప్యాకేజీ తీసుకుని ఆయనకు అవసరమైన సందర్భాల్లో వచ్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటారని, ఆయన పార్టీకి ఏపీలో ఉనికేలేదని, పూటకో పార్టీతో కలిసి రోజుకోరకంగా ప్రవర్తించే పవన్ కళ్యాణ్ అసలు నాయకుడే కాదని ఎద్దేవా చేశారు. చివరికి ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వైఎస్ జగన్ సైతం నాలుగు పెళ్లిళ్ల నిత్య పెళ్లికొడుకంటూ హేళన చేశారు. కార్లను బైక్‌లను మార్చినట్లు పెళ్లాలను మార్చే నాయకుడికి తనను విమర్శించే నైతిక అర్హతే లేదంటూ విమర్శించారు. ఇక అంతే తీవ్రస్థాయిలో ఆ పార్టీకి చెందిన రోజా, అంబటి, అమర్‌నాథ్, కొడాలి వంటి నాయకులు తమ స్థాయి మరిచి పవన్ వ్యక్తిగత జీవితాన్ని కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలూ లేకపోలేదు.

## రక్తం మరిగే కసితో.. విజయతీరాలకు..

వజ్రాన్ని ఎంత సానబడితే అంతగా మెరుస్తుందన్నట్లు.. బంతిని ఎంత బలంగా కొడితే అంతపైకి లేస్తుందన్నట్లుగా పవన్ కళ్యాణ్ ప్రత్యర్థుల విమర్శలనే మెట్లుగా చేసుకుంటూ రోజురోజుకూ పరిణితి చెందారు. అదే సమయంలో దూకుడినీ వదిలిపెట్టలేదు.. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ అధినేత, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏకవచనంతో సంబోధిస్తూ తగ్గేదేలే అన్నట్లు తీవ్ర విమర్శలు చేస్తూ సై అంటే సై అన్నారు. ఇక అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడిని స్కిల్ స్కాంలో అరెస్టు చేయడంతో పవన్ కళ్యాణ్ ఒక్కసారిగా యాక్టివ్ అయ్యారు. రాజమండ్రి జైలులో చంద్రబాబుని కలిసి సంఘీభావం ప్రకటించడంతో పాటు 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమిగా పోటీ చేస్తాయని అందులో బీజేపీని కూడా చేర్చే బాధ్యత తనదే అని ప్రకటించారు. ఇదే ఆంధ్రా రాజకీయాల్లో కొత్తశకానికి, మార్పునకు నాంది పలికిన ఘటనగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ తర్వాత అనుకున్నదే తడవుగా ఢిల్లీకి వెళ్లి బీజేపీని ఒప్పించి మూడు పార్టీల కూటమిని ఏర్పాటు చేసిన ఘనతను పవన్ కొట్టేశారు. తన స్థాయిని తగ్గించుకుని పొత్తు ధర్మాన్ని పాటిస్తూ 21 స్థానాల్లోనే బరిలోకి దిగారు. ఈ క్రమంలో టీడీపీ తోకపార్టీ జనసేన అంటూ వైఎస్సార్ సీపీ, కమ్యూనిస్ట్ పార్టీలు చంద్రబాబు చేతిలో పవన్ కీలుబొమ్మగా మారారని విమర్శించినా పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయ దుందుభి మోగిస్తూ అనూహ్యమైన ఖ్యాతిని దక్కించుకున్నారు. అదే ఊపుతో డెప్యూటీ సీఎం పదవితోపాటూ పంచాయతీ, అటవీశాఖలను దక్కించుకుని 'నభూతో న భవిష్యత్'.. అన్నట్లుగా రాజకీయాల్లో తన దైనశైలిలో.. దూసుకుపోతున్నారు.

## లీదర్లంతా ఒకలెక్క తానొకలెక్క అన్నట్లుగా..

2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టబోయే ఉపాధి పనులకు సంబంధించి చేసే ప్రతిపాదనల కోసం ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో మునుపెన్నడూ లేని విధంగా గ్రామ సభలు నిర్వహించి మంత్రిగా తొలి అడుగులోనే చరిత్ర లిఖించారు. ఇక విజయవాడకు వరదలు వచ్చినప్పుడు బాధిత ప్రాంతాలకు పవన్ వెళ్లడం లేదంటూ వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. దీనికి పవన్ కళ్యాణ్ వెంటనే కౌంటర్ ఇచ్చారు. తాను వెళ్తే సహాయ చర్యలకు ఇబ్బంది కలుగుతుందని, అధికార యంత్రాంగానికి ఒత్తిడి ఉంటుందని అధికారులు చెప్పడంతోనే తాను వెళ్లలేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తనను ఇంకా విమర్శించాలనుకుంటే వైఎస్సార్ సీపీ నేతలు తనతోపాటు ఎక్కడికైనా రావొచ్చని, తన కాన్వాయ్‌లోనే తీసుకెళ్తానని, తనతో కలిసి నడవాలని సవాల్ విసిరారు. అదే సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులు వరద బాధితులకు ఎక్కడెక్కడ సహాయం అందించారో బహిరంగ పరచాలంటూ విరుచుకుపడ్డారు. ఇక వరద బాధితుల సహాయార్థం ఏకంగా రూ.6 కోట్లను తనవంతు సాయంగా ప్రకటించారు. ఇందులో ఏపీ, తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్లకు రూ. కోటి చొప్పున ఇస్తానని, ఏపీలోని 400 పంచాయతీలకు రూ. లక్ష చొప్పున రూ.4 కోట్ల ఆర్థిక సాయం చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు డిఫెన్స్‌లో పడిపోయారు.

## సనాతన ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్‌గా..

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారంటూ అందులో ఆవు, పంది కొవ్వు కలిసిందంటూ సీఎం చంద్రబాబు ఆరోపించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో పలువురు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, హిందూవాదులు, వైఎస్సార్ సీపీ నాయకులు కోర్టు మెట్లెక్కడం.. టీటీడీ ఈఓ స్పందిస్తూ లడ్డూ తయారీలో కల్తీ జరగలేదని, కేవలం డాల్డా వంటివి వినియోగించారని చెప్పడంతో కూటమి నేతలు తలలు పట్టుకున్నారు. ఇలాంటి సమయంలో స్వామివారికి అపచారం జరిగిందంటూ పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత దీక్ష చేస్తూ ప్రధాన ఆలయాలను శుభ్రం చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక తమిళనాడు డెప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ చేసిన వ్యాఖ్యలకు ధీటుగా బదులివ్వడంతో ఆయన క్రేజ్ బీజేపీ అధిష్టానం వద్ద పీక్స్‌కు చేరుకుంది. తాజాగా వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మరణించారు. ఈ అనూహ్య ఘటనతో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడింది. ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోశాయి. ఈక్రమంలో తిరుపతికి వచ్చిన పవన్.. టీటీడీ ఈఓ బీఆర్‌నాయుడు, ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి తీరును ఏకిపారేశారు. టీటీడీ ధనవంతుల సేవలో తరిస్తోందంటూ మండిపడ్డారు. భక్తులు మరణించిన ఘటనలో టీటీడీ పెద్దలు, పోలీసు అధికారుల నిర్లక్ష్యం, ఉదాసీనత బయటపడ్డాయని ఆరోపించారు. ఈ విషయంలో ఎలాంటి భేషజాలకు పోకుండా క్షమాపణ చెప్పి తీరాల్సిందే అంటూ ధ్వజమెత్తారు. తద్వారా అంశమేదైనా ప్రశ్నించడం, ప్రజాపక్షం వహించడం మరువననే గట్టి సంకేతాలివ్వడం గమనార్హం.

## సుమోటోగా కేసులంటూ ప్రతిపక్షాలకు చెక్..

వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తూ.. అక్రమ అరెస్టులు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటమి నాయకుల మాట విని అక్రమ కేసులతో తమ కార్యకర్తలను ఇబ్బందులు గురిచేస్తున్న అధికారులను సప్తసముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టబోమంటూ హెచ్చరించారు. దీనికి సమర్థంగా బదులిచ్చే నాయకుడు కూటమి ప్రభుత్వంలో కనిపించలేదు. ఇలాంటి సమయంలో అధికారుల్లో ఆత్మస్థైర్యం నింపడం కోసం ఇకపై అధికారులను బెదిరిస్తే సుమోటోగా కేసులు నమోదు చేస్తామని, ఎంతటి వారికైనా జైలుకు పంపించేందుకు వెను కాడబోమంటూ ప్రెస్‌మీట్ పెట్టి మరీ పవన్ కళ్యాణ్ భరోసా ఇవ్వడం గమనార్హం. దీంతో అప్పటి వరకు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసిన నాయకులు మిన్నకుండిపోయారు. ఇక తాజాగా అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలో ఎంపీడీవోపై వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి చేయడంతో సుడిగాలి వేగంతో అక్కడికి వెళ్లిన పవన్.. అధికారుల్లో ధైర్యం నింపారు. అదే సమయంలో దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## సీజ్ ద షిప్.. ఓ సెన్సేషనల్

కాకినాడ పోర్టును స్మగ్లింగ్‌కు హబ్‌గా వైఎస్సార్‌సీపీ నాయకులు మార్చారని పవన్‌కళ్యాణ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పోర్టు నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 640 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని పవన్ స్వయంగా పరిశీలించారు. తమ పాలనలో అక్రమార్కులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాకినాడ పోర్టులో భద్రతా వైఫల్యం దేశ భద్రతకే ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఈ సమయంలో సీజ్ ద షిప్ అంటూ ఆయన ఉపయోగించిన డైలాగ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిపోయింది. ఇక ఇటీవల నిర్వహించిన మహారాష్ట్ర ఎన్నికల్లోనూ విచ్ఛిన్నకర శక్తులను పారద్రోలి, ఛత్రపతి శివాజీ స్ఫూర్తిని గెలిపించాలంటూ ఎన్డీయే తరపున ఆయన ప్రచారం చేశారు. తెలుగు ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయన ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడంతో పవన్‌ను ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించినట్లు సమాచారం.

## గిరిజనుల మనసు గెలుచుకున్న అరుదైన నేతగా

ఇక పవన్ కళ్యాణ్ ఇమేజ్‌ను స్టార్ నుంచి నాయకుడిగా చేసే క్రమంలో ఆయన ఇటీవల గిరిజన గూడేల్లో చేసిన పర్యటన చిరస్మరణీయంగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 4500 మంది ఉండే కొండజాతి ఓటర్ల ఆకాంక్షలను నెరవేర్చే క్రమంలో ఆయన అడవి బిడ్డలతో ఆటపాట, వారి సాంప్రదాయలను తన విగా భావించి పాటించారు. ఈ చర్యలు ఆయన్ని ఓ అరుదైన నేతగా నిలిపే అవకాశం ఉంది. బురద మట్టిలో గిరిజనులతో కలిసి నృత్యం చేయడం, కిలోమీటర్ల కొద్దీ వారితో కలిసి నడవడం ఈ క్రమంలో ఆయన మావోయిస్టులను సైతం ఆకట్టుకున్నారనే విశ్లేషణలూ వస్తున్నాయి. ఇక అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం, కృష్ణాజిల్లాలోని గిరిజనులను గంజాయి సాగుకు దూరం చేసే క్రమంలో వారికి ఉపాధి మార్గాలను పెంపొందించడంపై దృష్టి సారించారు. ఇందుకోసం వారికి ప్రపంచంతో కనెక్టివిటీ పెంచడం కోసం రోడ్లను దాదాపు రూ.55 కోట్లతో అభివృద్ధి చేయడం వాటి పనులను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో తెలియజేయడం గొప్ప విషయమే. ఇక సర్దార్ వల్లభాయ్ పటేల్ రాజ్యాలను భారత యూనియన్‌లో వీలీనం చేసి దేశ సమైక్యత కోసం పాటిపడితే.. తాను గిరిజనులను మిగిలిన వర్గాలకు చేరువ చేసి సామాజిక సమైక్యతకు బీజం వేస్తానని చెప్పడం పవన్‌కళ్యాణ్ ఇమేజ్‌ను మరోస్థాయికి తీసుకెళ్లింది. అందుకే ఏపీలో ప్రస్తుతం అసలైన పొలిటికల్ సూపర్‌స్టార్ ఎవరంటే అందరూ చెబుతున్న అభినవ వల్లభాయ్ పటేల్.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.

---

## కాలధర్మం

## బసిరెడ్డి శ్యామలమ్మ



బసిరెడ్డి శ్యామలమ్మ జనవరి 10వ తేదీ, శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన అమెరికాలో కన్నుమూశారు. ఆమె వయస్సు 81సంవత్సరాలు. చిల్లకూరు మండలం పాలిచెర్లవారిపాళెం ఆమె జన్మస్థలం. దొడ్ల దశరథరామిరెడ్డి – శ్రీదేవమ్మల కుమార్తె శ్యామలమ్మ. గూడూరు తాలూకా చెన్నూరు గ్రామానికి చెందిన బసిరెడ్డి(బత్తిన) బాబురెడ్డిని పరిణయమాడి ఈ దొడ్ల వారి ఆడపడుచు బసిరెడ్డి వారి కోడలయ్యారు. బాబురెడ్డి 2012లో కన్నుమూశారు.

శ్యామలమ్మ దానగుణ సంపన్నురాలు. తన చుట్టూ వున్నవారిని ఉన్నత స్థానంలో చూడాలని తపనపడేవారు. తన జీవనగమనంలో అనేక ఆటుపోట్లని, కష్టాలని ఆమె ధీటుగా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఆమెలో ఉన్న గొప్ప లక్షణం క్షమాగుణం. ఎదుటివారి తప్పువల్ల తాను నష్టపోయానని తెలిసినా, వాళ్ళని క్షమించే తత్వం శ్యామలమ్మది. ఆమె ప్రకృతి ఆరాధకురాలు. పూలమొక్కలన్నా, చెట్లన్నా ఆమెకి చాలా ప్రీతి. ఆమె మితభాషి కూడా. మాటలకంటే చేతలకే ఆమె ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు.

ఆమెకి ఇద్దరు కుమారులు ఉదయకిరణ్, శ్రీకాంత్. ఇద్దరూ ఇంజనీరింగ్ పూర్తి చేసి అమెరికాలో ఉన్నతస్థానాలలో స్థిరపడ్డారు. జన్మభూమికి సేవచేయండి అని అమ్మ చెప్పిన మాటకోసం నెల్లూరులో తమ ఐటీ సంస్థని స్థాపించి అనేకమంది నెల్లూరీయులకి శ్యామలమ్మ కుమారులు బ్రతుకు బాట వేశారు. ఇద్దరూ అమెరికాలో స్థిరపడిపోయినా, నెల్లూరుని మరువకుండా తమ వ్యాపారాలని కొనసాగిస్తూ పుట్టిన గడ్డ ఋణం తీర్చుకుంటున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన దివంగతురాలైన ఆ పుణ్యమూర్తికి శ్రద్ధాంజలి ఘటిస్తూ... శ్యామలమ్మ మృతితో శోకసముద్రంలో వున్న బసిరెడ్డి కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.



## ఘనంగా..స్వామి వివేకానంద జయంతి

బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న స్వామి వివేకానంద జయంతి ఘనంగా జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడుతూ, స్వామి వివేకానంద నేటి తరానికి ఆదర్శనీయులన్నారు. నాయకులు సురేంద్రరెడ్డి, యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో..

భారత వికాస్ పరిషత్–నెల్లూరుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న నెల్లూరులో ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు జరిగాయి. సేవాభారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, సింహపురి వైద్యసేవ సమితి కోశాధికారి గుర్రం సుధాకర్‌లు పాల్గొని, నగరంలోని ములుముడి బస్టాండ్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ స్వామి వివేకానంద ఆశయాల బాటలో నడవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు స్వామి వివేకానంద జీవితచరిత్రను పాఠ్యాంశాల్లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## క్రికెట్‌లో కావలి జేబీ కాలేజీ ఫస్ట్



నెల్లూరులోని వీఎస్‌యు (విక్రమసింహపురి యూనివర్శిటీ) కళాశాల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అంతర్ కళాశాలల సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో కావలికి చెందిన జేబీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. వీఎస్‌యు కళాశాల నెల్లూరు జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈనెల 12న జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో వీఎస్‌యు ఉప కులపతి ఆచార్య ఎస్ విజయభాస్కర్‌రావు పాల్గొని విజేతలకు బహుమతులందించారు. వీఎస్‌యు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, పీడీ ఏ.ప్రవీణ్‌కుమార్, టోర్నమెంట్ పర్యవేక్షకులు సిహెచ్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## మదర్ థెరిస్సా హోంలో పుట్టినరోజు వేడుకలు



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి చిన్నకొడుకు మన్నేటి స్నేహల్‌రెడ్డి ఈనెల 12న తన ముందస్తు పుట్టినరోజు వేడుకలను దుత్తలూరు మండలంలోని మదర్ థెరిస్సా హోంలో చేసి, అక్కడున్న నిరుపేద చిన్నారులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. అదేవిధంగా, వారందరికీ భోజనం ఏర్పాటుచేసి, వారితో కలసి భోంచేసి తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నాడు. మదర్‌థెరిస్సా హోంలోని చిన్నారులు ఈ సందర్భంగా స్నేహల్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

## ఆకట్టుకున్న సంక్రాంతి ముగ్గులు

సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ఈనెల 12న మండల కేంద్రమైన సీతారామపురంలో స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో రామిశెట్టి తిరుపతయ్య, ఆకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుష్మ ప్రథమ బహుమతి సాధించింది. నిర్వాహకులు ఆమెను అభినందించి 5వేల రూపాయలు బహుమతిగా ఇచ్చారు. అదేవిధంగా ద్వితీయ బహుమతి సాధించిన అపర్ణకుమారికి 3వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నందినికి 2వేల రూపాయలు అందజేశారు.

# నార్త్‌మోపూరు చైల్డ్ ఆశ్రమానికి..విశేష గుర్తింపు

### విశిష్ట సేవా పురస్కారంతో పాటు.. 5 లక్షలు అందజేత



అల్లూరు మండలంలోని నార్త్ ఆములూరులో స్వచ్ఛందంగా చిన్నపిల్లల ఆశ్రమం ఏర్పాటుచేసి ఎంతోకాలంగా అనేకమంది అనాథ బాలలకు చదువు చెప్పించి వారి జీవితాలకు వెలుగుబాటలు వేస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు శరత్‌చంద్రకు విశిష్టమైన పురస్కారం లభించింది. హిమాచల్‌ప్రదేశ్ రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎంఎన్ రావ్, డాక్టర్ షాలినీరావ్‌ల ఆధ్వర్యంలోని పర్గాంకర్ ఫౌండేషన్ వారు ఏటా అందజేసే ఉత్తమ సేవా పురస్కారాలకు ఈ ఆశ్రమం ఎంపిక కావడం విశేషం. ఆ ఫౌండేషన్ ప్రతినిధులైన తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ పిఆర్ అండ్ ఆర్‌డీ స్పెషల్ కౌన్సిల్ ఎంఎస్‌ఆర్ మూర్తి, నెల్లూరు వెంకటేశ్వరస్వామి గురునిలయం నిర్వాహకులు ఎం.గోపీచంద్, ఏపీ ఎస్‌ఎఫ్‌సీ లీగల్ అడ్వయిజర్ జి.మోహన్‌రావు తదితరులు ఈనెల 12న నార్త్‌మోపూరు గ్రామానికి వచ్చి ఆశ్రమాన్ని సందర్శించి, శరత్‌చంద్రకు పురస్కారంతో పాటు, 5 లక్షల రూపాయలను కూడా ఆ సంస్థవారు తమ వితరణగా అందజేశారు. తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సమాజానికి ఉత్తమసేవ లందిస్తున్న వారికి ఏటా తమ సంస్థ తరపున పురస్కారాలను, 5 లక్షల విరాళాన్ని ఇస్తుంటామని, ఈ ఏడాది నార్త్‌మోపూరు చిల్డ్రన్ హోమ్ నిర్వాహకుని సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. తల్లితండ్రుల ఆదరణకు నోచుకోని చిన్నారులను అక్కునచేర్చుకుని వారికి సేవలందిస్తున్న శరత్‌చంద్రను ఆ సంస్థ ప్రతినిధులు అభినందించారు. శరత్‌చంద్ర మాట్లాడుతూ, తనకు ఈ పురస్కారం కింద అందజేసిన 5 లక్షలను ఆశ్రమంలో బాలలకు అవసరమైన ల్యాబ్ ఏర్పాటుకు వినియోగిస్తామని చెప్పారు. ఆశ్రమ ఉపాధ్యాయులు, బాలలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## వేణుగోపాలస్వామి దేవాలయంలో.. వైకుంఠ ద్వారదర్శనం



నెల్లూరు మూలాపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 10న వైకుంఠ ద్వారదర్శనం వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని–అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయంలో భారీగా పుష్పాలంకరణలు చేశారు. ఆలయ ఛైర్మెన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

### శబరి శ్రీరామక్షేత్రంలో...

ముక్కోటి పర్వదినం సందర్భంగా ఈనెల 10న నెల్లూరు దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంలో వైకుంఠ ద్వారదర్శనం ఏర్పాటుచేసి, భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. తొలుత స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, అన్నం దయాకర్‌గౌడ్, చంద్రారెడ్డి, రాజు తదితరులు పర్యవేక్షించారు. భక్తులు భారీగా తరలివచ్చి ఉత్తర ద్వారదర్శనం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.

## 'హెల్మెట్'..మీ ప్రాణాలను కాపాడుతుంది

- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



'హెల్మెట్ ధరించండి, ప్రమాదాల నుంచి అది మిమ్మల్ని కాపాడుతుంది'.. అంటూ పోలీసులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల ముమ్మరంగా ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు. జిల్లాలోని ఏఎస్‌పేట మండలం హసనాపురంలో బస్టాండ్ కూడలివద్ద పోలీసులు గ్రామస్థులకు రోడ్డు భద్రతా అంశాలను వివరిస్తూ పలు సూచనలు చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఎస్ఐ సైదులు మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు తెలుసుకుని వాహనాలు నడపాలని, కార్లలో వెళ్ళేవారు తప్పకుండా సీట్ బెల్టులు ధరించాలని, ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేసినా, అతివేగంతో వాహనాలు నడిపినా ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవన్నారు.

## టూకీగా...



### వరదరాజస్వామి ఆలయంలో ఉత్తర ద్వారదర్శనం

ముక్కోటి సందర్భంగా జొన్నవాడలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వరదరాజస్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటుచేసి, భక్తులకు స్వామివారు–అమ్మవార్ల దర్శనం కల్పించారు. అనంతరం స్వామివార్లను గరుడ వాహనంపై వేంచేపు చేసి పెద్దఎత్తున గ్రామోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### ఇనమడుగు పంచాయతీ కార్యాలయం తనిఖీ

కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలోని పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఇఓ పీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతి కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### కలిగిరిలో పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు

కలిగిరి పంచాయతీలో పనిచేస్తున్న 22 మంది కార్మికులకు సంక్రాంతి పండుగల సందర్భంగా పంచాయతీ పాలక వర్గం వారు 9 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసి, కార్మికులకు సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పారు. సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ కొండారెడ్డి, సభ్యులు రవి, పంచాయతి కార్యదర్శి రవిచంద్ర తదితరులు పర్యవేక్షించారు.

### విడవలూరులో అంకమ్మతల్లికి అభిషేకపూజలు

సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని మండల కేంద్రమైన విడవలూరులో వెలసివున్న గ్రామదేవత శ్రీ అంకమ్మ తల్లికి ఈనెల 12న పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి కె.స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక పూజల్లో పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. నర్రా రఘురెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

### ఆత్మకూరులో పూర్వ విద్యార్థుల సమావేశం

ఆత్మకూరు ప్రియదర్శిని హైస్కూల్‌లో 1998–99 సంవత్సరాల్లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు 27 సంవత్సరాల తర్వాత ఈనెల 12న వారు చదివిన స్కూలులో కలుసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. అప్పటి ఉపాధ్యాయులను గౌరవించి సన్మానించారు.

### పల్లిపాళెంలో కోడిపందెంగాళ్ళు దొరికారు

నెల్లూరు రూరల్‌లోని పల్లిపాళెం గ్రామంలో ఈనెల 12న జరుగుతున్న కోడిపందాలపై రూరల్ ఇన్స్‌పెక్టర్ వేణు, ఎస్ఐ, పోలీసుల ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు చేసి 18 మంది కోడిపందెగాళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 3 కోడిపుంజులను, 6 ద్విచక్రవాహనాలను, 13వేల రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు.

### దుర్గంపల్లి వద్ద పేకాట : నలుగురు అరెస్ట్

ఉదయగిరి మండలంలోని దుర్గంపల్లి వద్ద స్థావరం ఏర్పాటుచేసుకుని పేకాటాడుతున్న వారిని ఇటీవల ఉదయగిరి సీఐ వెంకట్రావు, సీఐ ఇంద్రసేనారెడ్డిలు పట్టుకున్నారు. నలుగురిని అరెస్ట్ చేసి, వారివద్దనుంచి 4వేలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 8 మందిలో నలుగురు పారిపోయారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

### సంగమేశ్వరునికి వేడుకగా చప్పర ఉత్సవం

మండలకేంద్రమైన సంగంలో వెలసివున్న కామాక్షీదేవి సమేత శ్రీ సంగమేశ్వరస్వామికి ఆలయ అర్చకులు ఈనెల 13న వేడుకగా చప్పర ఉత్సవం నిర్వహించారు. స్వామివారిని–అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి, పల్లకిలో కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

### మనుబోలు విశ్వనాథస్వామికి అన్నాభిషేకం

పౌర్ణమి శివముక్కోటి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఈనెల 13న మనుబోలు–చెర్లోపల్లి రైల్వేగేటు వద్దనున్న శ్రీ విశ్వనాథ స్వామి దేవస్థానంలో స్వామివారికి ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా అన్నాభిషేకం నిర్వహించారు. తొలుత స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఏకాంబరం శేషయ్య–సుభాషిణి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## అరుదైన ఆధ్యాత్మిక సంబరం..

# మహా కుంభమేళా

## త్రివేణి సంగమానికి పోటెత్తుతున్న భక్తులు

దిక్కులు పిక్కటిల్లేలా ఢమరుక నాదాలు.. మహాదేవుని శరణుఘోషతో నిండిన నదీ తీరాలు.. ఆధ్యాత్మిక సూత్రాలను ప్రభోదించే సిద్ధుల ప్రసంగాలు, నాగ సాధువుల రాజస్నానాలతో ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళా కనుల పండువగా ప్రారంభమైంది. జనవరి 13న పుష్య పౌర్ణమితో ఆరంభమైన ఈ మహావేడుకలో కోట్లాదిమంది ప్రజలు పాల్గొంటున్నారు. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమ స్థానమైన ప్రయాగ్ రాజ్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ మహత్తర ఘట్టంలో అఘోరీలు, సన్యాసులు, రుషులు, పీఠాధిపతులు, హిమాలయ యోగులు, బైరాగులు, సాధారణ ప్రజలు పాలుపంచుకుంటున్నారు.

### సంక్రాంతి నుంచి శివరాత్రి వరకు..

ప్రపంచంలోని హిందువులందరికీ అత్యంత ప్రవిత్రమైన మహా కుంభమేళా ఉత్తర ప్రదేశ్‌లోని త్రివేణి సంగమ క్షేత్రమైన ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభమైంది. ఈనెల 13 నుంచి ఫిబ్రవరి26 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 7వేల కోట్ల రూపాయలతో భారీ ఏర్పాట్లు చేసింది. 1.6 లక్షల తాత్కాలిక టెంట్లను, 1.5 లక్షల మరుగుదొడ్లను, 2 లక్షల వరకు కొళాయి కనెక్షన్లను అందుబాటులోకి తెచ్చింది. 15 వేల మంది పారిశుధ్ధ్య కార్మికులు భక్తులకు ప్రతిరోజూ సేవలందిస్తున్నారు. వేలాదిమంది పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

### మోక్షమార్గం.. నదీస్నానం

ఇక 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే పూర్ణ కుంభమేళాలు 12 పూర్తయితే మహా కుంభమేళా వస్తుంది. సూర్యుడు మకరరాశిలోనూ, గురుడు వృషభ రాశిలో సంచరిస్తున్న పుణ్య గడియల్లో ఈ మహాకుంభమేళా ప్రారంభమవుతుంది. ప్రసుత్తం యూపీలో జరుగుతున్న మహా కుంభమేళా ఈ కోవలోకే వస్తుంది. ఇందులో భాగంగా 45 రోజుల పాటు దాదాపు 40 కోట్ల మంది భక్తులు గంగానదిలో స్నానమాచరించి ప్రతిరోజూ రాత్రి 7గంటలకు నిర్వహించే గంగా హారతిలో పాల్గొంటారని అంచనా. సకల దేవతలు భూమిపైకి వచ్చి మోక్షసిద్ధిని కలిగించే ఈ మహాకుంభమేళాలో పాల్గొని దైవనామస్మరణ చేస్తూ నదీస్నానం కావించిన వారికి పునర్జన్మ ఉండదని భక్తుల నమ్మకం. అలాగే హిమాలయాల్లో ఏళ్ల తరబడి తమ తపస్సు ద్వారా తెలుసుకున్న మహత్తర విషయాలను సిద్ధులు, యోగులు తమ ప్రదర్శనలు, ప్రసంగాల ద్వారా భక్తులకు తెలియజేసి ఆ తర్వాత మళ్లీ హిమాలయాలకు వెళ్లిపోతుంటారు. ఈ క్రమంలో వచ్చే ఆరు పవిత్రమైన వేళల్లో స్నానం చేస్తే మోక్షమార్గం పొందుతారని భక్తులు భావిస్తారు. జనవరి 13 పుష్య పౌర్ణమి, 14న మకర సంక్రాంతి, 29న మౌని అమావాస్య, ఫిబ్రవరి 3న వసంత పంచమి, 12న పౌర్ణమి గడియలు, 26న మహాశివరాత్రి రోజుల్లో మహాశివుడి కోసం ధ్యానంచేసి ప్రయాగ్‌రాజ్‌లో పుణ్య స్నానాలు చేసేందుకు కోట్లాదిమంది భక్తులు సిద్ధమవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 125దేశాల నుంచి దాదాపు 25 లక్షల మంది విదేశీ భక్తులు కూడా మహా కుంభమేళాకు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు. ఇక కుంభమేళాకు హాజరయ్యే మహా జనవాహినిని అంతరిక్షంలో నుంచి కూడా గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు ప్రకటించడం విశేషం!..






జననం
08-11-1930

నిర్యాణం
18-01-1995

## 30వ వర్ధంతి

## స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారు

జర్నలిజం వ్యాపారం కాకూడదు..
జర్నలిస్టులు క్యాపలిస్టులుగా మారకూడదు.
అలా జరిగిన రోజున ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే
నాలుగు స్తంభాలలో ఓ మూలస్తంభం కూలిపోయినట్టే!

- కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి
వ్యవస్థాపకులు, లాయర్

మహనీయుని మహాత్మకు మా నివాళి.

లాయర్ సిబ్బంది    కుటుంబసభ్యులు

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com